

స్నేహాగీతలు

కబీర్ దోహాలు - 500 అనువాద పద్యాలు

డా॥ భూసురపల్లి వేంకటేశ్వర్లు

ప్రోత్సాహం : గుళ్లపల్లి సుబ్బారావు సేవాసంస్థ

శ్రీ పెద్ది సాంబశివరావు, శ్రీమతి రామరత్నమ్మ దంపతులకు అంకితం

ఎట్టి వేదికందు ఏ ముహూర్తమునందు ।
ఏ నిమిత్తమలది నెదురుపడెనొ ।
ఆత్మబంధు వనుట అక్షరసత్యంబు ।
పెద్దివారు నాకు చద్దిమూట

హితులు, సన్నిహితులు, హిమశైల సన్నిభులు ।
మదిని దలచబోరు మంచి తప్ప ।
నాదు సుగతి దలచు, నాదు ప్రగతి జూచు ।
మనసు గలిగి యున్న మాతృసములు.

కళల కాంతులన్న కలవరించు మనసు ।
పొరుగు మేలుసేయ పొందు ముదము ।
జ్ఞానవీధులన్న మానసమ్మొప్పును ।
అట్టి బుధుల కూర్మి గట్టి ఫలము.

కష్టమెంతో గొని నిఘంటువులను ।
గూర్చి సూక్తులన్ని జేర్చి చూపె ప్రతిభ -
భాషపట్ల మోజు భావానురక్తియు ।
తనదు శ్వాసలగుచు దనరుచుండె.

శాశ్వతమగు స్నేహ సౌహార్ద్రవాంఛతో ।
కృతిని ఇచ్చుచుంటి హితవుగాను ।
రామరత్నమ హరి రాఘవ రాములున్ ।
సాదరమ్మను ఎద మోద మలర. - **రచయిత**

Edition I : 2013, Edition II : 2025 E-Book తెలుగుతేజం.కామ్, గుళ్లపల్లి సుబ్బారావు సేవాసంస్థ, గుంటూరు, 98491 43292

''నాదతనుమనిశం''

మిత్రులు, స్నేహితులు, ఆప్తులు, ఆత్మీయులు । అని నాలుగు రకాలు. ఒక్కొక్కరిలో ఒక్కొక్క సుగుణం వుంటుంది. నలుగురిలోను కలిసిపోయే స్వభావం కన్పిస్తుంది. నాకు భూసురపల్లికి అలాంటి అత్మీయత. ఏదో గుండెలోతుల్లోంచి పొంగిపొరలే భావబంధం. అందుకే ఆయనను ఏకవచనంతో సంబోధిస్తున్నాను ఇందులో.

మా ఇద్దరికీ కావలసినవాడు । మిత్రులు, స్నేహితుడు, ఆత్మీయుడు నాగభైరవ కోటేశ్వరరావు. నాగభైరవను భూసురపల్లి 'మాష్టారు' అని గౌరవపురస్సరంగా సంభావిస్తాడు. నాగభైరవ ఆకాంక్షలో భాగమే ఈ కబీరు దోహాల అనువాదమని భూసురపల్లి అన్నపుడు నా కళ్లు చెమర్చాయి. ఎప్పుడో 10 సంవత్సరాలనాడు గతించిన వ్యక్తి స్మృతులను ఇంకా మిగుల్చుకొని వారు చెప్పిన చివరిమాటల్లా భావించడం ఎంత సౌహార్ధం.

నేను కందుకూరులో అధ్యాపక జీవితం గడిపిన నాటి నుండి భూసురపల్లి పరిచయం. నాలుగుపదుల మమతానుబంధం. ఆయన భూసురపల్లి కాదు,

డా. ఆర్. అనంతపద్మనాభరావు,
విశ్రాంత అడిషనల్ డైరెక్టర్ జనరల్, దూరదర్శన్, ఢిల్లీ.

భూసురకల్పవల్లి. సంగీత సాహిత్య తీగమల్లి. అందుకే త్యాగయ్య 'నాదతనుమనిశం' ఈ గ్రంథం ముట్టుకోగానే నాకు గుర్తుకొచ్చింది.

సంగీత సాహిత్యాల్లో రెండింటిలో సమప్రతిభగల ఇలపావులూరి కామేశ్వరరావు గుర్తుకొచ్చారు. ఇద్దరూ చేపట్టింది అధ్యాపకవృత్తి. ఇద్దరిలోని గాఢ పరిశీలనా శక్తి స్మరణకు వచ్చాయి. అది గురుకృప. నాగభైరవ కళాపీఠం పక్షాన నాకు 2002లో హైదరాబాద్‌లో అవార్డు యిచ్చారు. ఆ సభలో భూసురపల్లి ఉన్నారు. నాగభైరవ ఏ మంచి పనిచేసినా ఈయన ఆయనకు సైదోడు.

చేబ్రోలులో సంజీవదేవ్ సాహచర్యము, గుంటూరులో ఇప్పుడు ఎందరో కవిపండితుల గాయక సంబంధము భూసురపల్లిని కబీర్ దోహాల అనువాదానికి పురికొల్పి ఉంటాయి. సజ్జన సాంగత్యం ఎన్నడూ వృథాపోదు.

మూడు నెలల క్రితం గుంటూరులో నాగార్జున కల్చరల్ కేంద్రం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభాసందర్భంలో తన అనువాదం గూర్చి వేంకటేశ్వర్లు నాతో ప్రస్తావించారు. ముందుమాట వ్రాయాలన్నారు. ఔపచారికంగా అన్నమాటలు అనుకున్నాను. పదవిలో ఉండి, భవిష్యత్తులో ఉపయోగపడే వ్యక్తులచేత నాలుగు మాటలు వ్రాయించుకొంటే ప్రయోజనం. ఎన్నడో రిటైరయిన నాతో పని ఏముంది? ఫలితమేముంది. అయినా కుమారుడు వేదవ్యాసునితో కలిసి యింటికి వచ్చి

అప్యాయంగా 'నాలుగు మాటలు వ్రాయండి' అంటే నాకు ఆశ్చర్యం వేసింది. ప్రేమానురాగాలు మెప్పించాయి.

భూసురపల్లి ఏదో ఒకటి ఏటా వ్రాయాలనే కోవలోవాడు కాదు. ఏది వ్రాసినా నిదానంగా నలుగురు మెచ్చే రీతిలో చిరకాలం నిలిచే గ్రంథాలు వ్రాశాడు, వ్రాస్తున్నాడు. ఆయనలో కవి, పరిశీలకుడు, పరిశోధకుడు, రచయిత, అధ్యాపకుడు, గురువు, అనుభవజ్ఞుడనే సప్తస్వర సమ్మేళనం వుంది. తండ్రి భూసురపల్లి వాత్సల్య స్పృహరేఖలు తనకు నీడగా, గొడుగులా, ఒక శ్వేతఛత్రంలా వెంటనే ఉన్నాయి.

కవిగా ***'ఒక అనుభవం నుంచి'*** కవితా సంకలనం (2005లో) వెలువరించి 'సెభాష్' అనిపించుకొన్నాడు. పరిశోధకుడుగా ఎవ్వరూ జోలికిపోని సాహిత్య రూపకాలపై సమగ్రపరిశోధన చేసి సాహిత్య రంగంలో స్థానం సంపాదించుకొని డాక్టరేట్ పొందాడు. దేవులపల్లి కృష్ణశాస్త్రి జీవనరేఖలను కేంద్ర సాహిత్య అకాడమీ వారి కోరిక మేరకు 1994లో మోనోగ్రాఫ్ రూపంలో తీసుకువచ్చాడు. వీటన్నింటికీ మించి 1986లో ఎంతో కృషితో సంకలనపరిచిన ***'ఆంధ్రప్రదేశ్ నాదస్వర డోలు కళాకారుల చరిత్ర'*** సమగ్రము, సాధికారికము అయిన పరిశోధనాగ్రంథం.

ఈ నేపథ్యంలో మనం ప్రస్తుత కబీర్ దోహావళి గమనించాలి. ఇతఃపూర్వం కబీర్ వచనావళి అని ఒకరిద్దరు తెలుగులో అనువదించారు.

తన జీవనగమనంలో భక్తితో ముక్తిని పొందిన ఘనుడు కబీర్. తనకుతాను మూలభాషతో గాఢ పరిచయం అంతగా లేకపోయినా కబీర్ భావావేశములోని ఆర్తిని, ఆవేదనను, ఆవేశాన్ని వొడిసిపట్టుకొని భూసురపల్లి అనువాదం చేశాడు. ఈ ఆటవెలదులు చదువుతోంటే వేమన స్మృతిపథంలో మెదలుతాడు. నాలుగు పాదాలలో । చతుష్పాదులుగా జీవించే ద్విపాదులకు కొరడా ఝుళిపించి కర్తవ్యాన్ని గుర్తుచేసిన వేమన స్మరణకు వస్తాడు. *'విశ్వదాభిరామ వినురవేమ!'* అనే మకుటం తీసివేసి పద్యాలు చదువుకొంటూ వెళ్తే కబీరు ప్రవచించిన తాత్త్విక చింతన సరళిలో వేమన సూక్తులు సరిపోతాయి. బాహ్యాడంబరాన్ని ఇద్దరూ నిరసించారు. అనువాదానికి వెళ్దాం.

అనువాదం కత్తిమీద సాములాంటింది. డబ్బింగ్ సినిమాలాంటిది. లిప్ మూవ్‌మెంట్‌కు సరిపడేలా, పాటలో పదబంధాలకు సరిపడేలా మాటలు, అక్షరాలు దొర్లించాలి. అనువాదకుడికి స్వతంత్రత లేదు.

మూలరచయితల భావాన్ని చెడగొట్టకుండా చెబితేనే అది మంచి అనువాదం అవుతుంది. భూసురపల్లి ఈ కృషిలో కృతకృత్యుడయ్యాడు.

'మాట చెప్పుటెంత మధురమై యొప్పును'

'స్వాతి చినుకు కొరకు సాగరమున శుక్తి తపము' చేసినట్లు తగిన పదబంధం కోసం ఆయన పరితపించాడు. ''మళ్ళీ దొరకబోదు మానవజన్మంబు'' అని మానవజన్మ దొరికినపుడే కబీర్ దోహాలను అనువదించాడు. ఈయన ఆటవెలది రచనలో తూగు వుంది. పదబంధంలో ఒక నిపుణత వుంది.

''లోకమంత నీవు లోన నీవుండగా
చేసిన దొసగెల్ల చెరిపివేతు
ఎదుట తప్పుచేసి యేమని ప్రార్థింతు
సిగ్గుగల్గుచుండె చిద్విలాస''

కబీర్ అంతరంగాన్ని వొడిసిపట్టిన నేర్పువుంది.

తెలుగు నుడికారానికి దగ్గరగా ***'తెలుగు కబీర్'*** లా భూసురపల్లి కన్పిస్తాడు. 'నాదనామ క్రియకు వేదియగును' అన్నప్పుడు సంగీతములో ఆయన పరిణతి సమయానికెలా సరితూగిందో అనిపిస్తుంది.

'అన్ని భావములకు ఆది సప్తశ్రుతులు
శ్రుతుల గతుల జరిగె సృష్టియంత
లయము శ్రుతులలోని లాలిత్యజీవమ్ము

డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు

కాలధర్మమిదియె కలిమి ఇదియె'

అలాగే 'గాయకుండు తాను గ్రాహి తాను'। చదవగానే భక్తునికీ భగవంతునికీ మధ్య శేషశేషిత్వ భావముందనే వైష్ణవతత్వం గుర్తుకు వస్తుంది.

ఆదిశేషునికీ, విష్ణువు (వేంకటేశ్వరుడు) మధ్య శేషశేషత్వ సంబంధం, ఇక్కడ తండ్రీ తనయులకూ శేషశేషత్వ సంబంధం. ఎంత చమత్కారం, తండ్రి పేరు భూసురపల్లి ఆదిశేషయ్య. ఇక గురువులకి కవితలో అమృతత్వాన్ని కల్పించాడు భూసురపల్లి.

'వేల్పుబువ్వ గురుడు విషవల్లి దేహమ్ము
ఛాత్రు నమృత మయుడు చక్కబెట్టు
దేహమిచ్చి యైన దేశికుంజేపట్టు
చీకటింట దివ్వె శిక్షకుండు''. (238)

ఈ నాలుగు పాదాలకు గీతావ్యాఖ్యానంలా 400 పుటలు వ్రాయవచ్చు. అమ్మని 'వేల్పుబువ్వ' అనడం ఎంత చక్కని తెలుగు నుడికారం, వేల్పులు మనలా ముప్పొద్దు భోంచేయరు. అమృతం తాగి ఆకలిదప్పులు మరచి నిత్యయౌవనులుగా మిగిలిపోతారు. అలానే అమృత సమానుడైనవాడు గురుడు, మరి తన శిష్యుని అమృతమయుడు చక్కబెడతాడు.

'జ్ఞానాంజన శలాకయా!' అన్నారు. అలాంటి గురువుకు శరీరం యిచ్చి తన చర్మాన్ని చెప్పులుగా కుట్టించి అయినా శిష్యుడు చేపట్టాలి. ఇక్కడ ఎంత నిగూఢార్థం ఉందో! గురువును వెతుక్కొంటూ వెళ్లి చేపట్టాలి. ఆధునిక కాలంలో బస్ కండక్టర్ని, రిక్షా వాలాను 'గురూ!' అని సంబోధించే దశకు వచ్చాం మనం. హతోస్మి! ఆ శిక్షకుడైన గురువు ఎలాంటివాడు। చీకటింటి దివ్వె. ఇది అద్భుతమైన పదబంధం. తెలుగునాడిని పట్టుకొన్నమాట. గురువు విడువరాదు మరణమైన.

508 ఆటవెలదులలో ముగించారు మిత్రులు వెంకటేశ్వర్లు. బహుశా అధ్యాపక వృత్తిలో వొత్తిడి, ఇతరత్రా గుంటూరు సాంస్కృతిక సాంఘిక కార్యక్రమాలలో తీరుబడిలేనితనం కారణం కావచ్చు. మొన్నటికి మొన్న కూచిభొట్ల ఆనంద్ సారథ్యంలో జాతీయస్థాయిలో గిన్నిస్ బుక్ రికార్డు స్థాపించే నాదస్వర, డోలు విద్వాంసుల **మహావాద్య సమ్మేళనం** హైదరాబాదులో నిర్వహించినపుడు **ప్రధాన పాత్రధారి** భూసురపల్లి. సూత్రధారి ఆనంద్, ఇన్ని పనులమధ్య 508తో సరిపెట్టారు.

త్వరలో పదవీ విరమణ! అప్పుడైనా 'సమగ్ర కబీర్ దోహావళి' అనువాదం చేపట్టాలి. వృత్తిని వదలి ప్రవృత్తికి దోహదం చేయాలి. అది మీరే చేయగలరు. షష్టిపూర్తి నాటికైనా పూర్తిచేయండి.

ఇటీవలి కాలంలో కుహనా సన్యాసులు, పీఠాధిపతులు విస్తరించారు. 'తలలు బోడులైన తలపులు బోడులా' అన్నాడు వేమన. ఆ కోవలోనే

తలలు నునుపు జేసి తడిబట్ట జుట్టిన
చిత్త మదుపు జేయ చేతనగునె? అని వ్యంగ్యాస్త్రం సంధించాడు.

కాషాయ వస్త్రధారణ చాలదు అంటూ

'కావి రంగు వలువ, గళము పూసల పేర్లు,
చేత తిరుగుమాల, చిరత చెక్క
మోర తిలకమద్ది ఊరేగు నటునికి
మనసునంటు మకిల మాన్పగలవె' (267)

అక్షరలక్షలు ఇవ్వవలసిన పదాలివి. కాషాయ వస్త్రానికి చక్కని తెలుగు పదబంధం। కాని రంగువలువ. మెడలో పూసలదండ, చేతిలో జపమాల, భజన పలకలు, ఊర్ధ్వ త్రిపుండ్రాలు। వీటితో వీధుల్లో తిరుగుతున్నాడు ఓ స్వామీజీ! ఆయన కుహనాస్వామి.

ఊరేగునటునికి అనే మాటలో ఆయన డాంబికత్వాన్ని తూర్పారబట్టారు. మనసులోని మాలిన్యాన్ని తొలగించుకోమని సద్బోధ చేశారు. కబీర్, వేమన మన జాతికి వరాల పంటలు.

చదువు । సంధ్య । సంస్కారం । అంటాం. ఆ మూడింటినీ సమన్వాయం చేసుకొని మనిషి జీవించాలి.

చదివినంతలోనె సాధించునదిలేదు
కోమలమగు నెడద కూడవలయు
నీటనానినంత ఈటె మెత్తనగునె
ఎడద మెత్తనైన బెడద లేదు.

నాలుగు పాదాలలో కబీర్ జీవనసారాన్ని సంక్షిప్తంగా చెప్పాడు. ఆయన దార్శనికుడు. ఆయన భావజాలాన్ని పొదుపైన మాటల్లో సరళ సుందరంగా భూసురపల్లి మనకందించాడు.

గురువును గూర్చి వివిధ రీతులలో కబీర్ గురుతరంగా చెప్పాడు.

'సద్గురు కిలలోన సాటి ధనములేదు'

'గురుని పోల్చిచూడు కుమ్మరి తానౌను'

కుమ్మరి కుండను తీర్చిదిద్ది, అందంగా తయారు చేసినట్లే శిష్యుడనే బంకమట్టి ముద్దను అద్భుతంగా మలుస్తాడు గురువు. అందుకే

'గురువు గుణము చెప్ప తరము కాదు'

'చదువుదాత కెవరు సాటిరారు'

'పావనమ్ము గురుని పాదస్పర్శ'

ఈ పద్యాలు 6-10 తరగతుల విద్యార్థులకు పాఠ్యగ్రంథాలలో భాగంగా చేర్చవలసిన సూక్తులు. కంఠతా పట్టించవలసిన పద్యాలు.

రచనాశైలి, పదబంధకల్పన, అనువాద సరళి అనే త్రివేణి సంగమంలో మనం తడిసి ముద్ద అవుతాం. పునీతులమవుతాం. ముందుకు పదండి. అధ్యాపకుడు, కవి, విమర్శకుడు । అనే ముప్పేట బంధం మనల్ని కట్టి పడేస్తుంది.

భూసురపల్లి బుధజన కల్పవల్లి
ఆయన కలం వెంట పరుగులు తీసిన
508 ఆటవెలదులు సాహితీ రంగస్థలంపై
నాట్యమాడే ఆటవెలదులు
భూసురపల్లీ ! ధన్యోస్మి !

ఆర్. అనంతపద్మనాభరావు
సెల్ : 98665 86805, హైదరాబాద్

అభినందనలు

మిత్రమా, 12 యేళ్ల తరువాత అన్నమయ్య కళావేదిక నుంచి నీ స్నేహగీతలు గ్రంథాన్ని రెండవ ముద్రణ తీసుకువస్తున్నావు. ఇది నీ ప్రతిభకు ప్రతిరూపం. ఆధునిక సాంకేతికతల ఆధారంగా కబీరు పద్యాలు ఊరూరా ప్రతి చరవాణిలోనూ మారుమ్రోగేలా అందించగలుగుతున్నావు. నీకు, ప్రచురణ కర్తలకు అభినందనలు.

అన్నమయ్య సేవాసమితి, *04.10.2025* *ఆర్. అనంతపద్మనాభరావు*

ఒక్కక్షణం ఆగండి......

"లాలీ మేరే లాల్ కీ జిత్ దేఖో తిత్ లాల్
లాలీ దేఖన మైగయీ మే భీ హోగయీ లాల్"

ఆ పదం విన్నప్పుడు నా శరీరం గగుర్పొడిచింది. భారతీయదార్శనికుల్లో ఇంతటి మహానుభావుడు వేరే లేడనిపించింది. వేమన, నానక్, వివేకానంద వంటి చైతన్యమూర్తుల్లో కబీర్ స్థానం అద్వితీయమైంది. అలాగే ఆకాశవాణిలో ఉదయం పూట ప్రసారమయ్యే 'సూక్తి సుధ' కోసం కన్ఫూషియస్‌ని చదివాను. ఆరుద్రగారి అనువాదం తిరక్కురళ్ (తిరువళ్ళువర్ తమిళ రచన) చదివాను, కాని కబీర్ అంతగా మిగిలినవేవీ గుండెలదాకా పోవడం లేదు. వెంటనే పై దోహాని తెలుగులోకి అనువదించాలనిపించింది. వచనంలో చెప్పాలనుకున్నాను. "నా ప్రియతముని యొక్క ప్రకాశము ఎక్కడ చూచినా కనిపించుచున్నది. నేను ప్రకాశమును జూడబోయితిని, నేనే ప్రకాశమును పొందినాను" అని వచ్చింది. కబీర్ దోహాల్లో ఉన్నంత గాఢత ఆ మాటల్లో దొరకలేదు. అపుడు కబీర్ మాటలకు ఆటవెలది బాగుంటుందని భావించి

"అణువు అణువునందు ఆనందరూపమై
వెలుగుచుండు నాడు విభుని రూపు
అతని కాంతి వెదకి, అతనిలో లీనమై
వెలుగులందు జేరి వెలిగిపోతి"

అని రాయగా, తెలుగు నుడికారం పోకుండా తెలుగు చేశాననిపించింది.

వాటిని చూసిన మా గురుదేవులు డా. నాగభైరవ కోటేశ్వరరావుగారు ఈ పద్యాలు ఒక వందైనా రాయమని ప్రోత్సహించారు. ఆ ఫలితమే ఈనాటి ఈ స్నేహగీతలు.

కబీరు గురించి చెప్పడానికి దృశ్యమానమయ్యే ఆధారాలకంటే జనశ్రుతులే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ మధ్య వచ్చిన రచనలవల్ల ఆయన 1445లో పుట్టి 1575లో మరణించాడని కొందరు, 1399లో పుట్టి 1518లో మరణించాడని కొందరు చెబుతున్నారు. అయితే అందరూ అంగీకరిస్తున్న విషయం ఆయన శతాధిక వత్సర జీవనుడనేది. కబీరు అనాథ బాలుడనీ కనిపారవేయబడిన ఆ పసికందును 'నీమా', నీరు అనే దంపతులు పెంచి పెద్ద చేశారని తెలుస్తుంది. వీరు 'సాలె' వారని కొందరు, ముస్లిం దంపతులని కొందరు చెబుతున్నారు. మరికొన్ని చోట్ల వారు ముస్లిం దంపతులయ్యునూ నేతవృత్తితో జీవిస్తుండేవారని చెప్పారు. భారతీయ సంస్కృతిలో 'భిన్నత్వంలో ఏకత్వం' అనే సూక్తికి నిదర్శనంగా కబీరు పుట్టుకే కాదు, ఆయన జీవితం, ఆయన ఆదర్శం, తాత్త్వికత అన్నీ నిలుస్తాయి. ఇస్లాం మతం హిందూదేశంలో ప్రవేశించడంతో అంతకు ముందెన్నడూలేని ఒకానొక తాత్త్విక మత సంఘర్షణ మొదలైంది. బౌద్ధ జైన మతాలున్నప్పటికీ అవి హిందూ సంస్కృతి జనితాలే గనుక ఇంతగా భిన్నత్వం మున్నెన్నడూ కనిపించలేదు. ఇలా మతపరమైన ఘర్షణలతో కదిలిపోతున్న కాలంలోనే కబీరు పుట్టాడు.

కబీరుకు ఇద్దరు భార్యలని, ఇద్దరు పిల్లలని ఈయన రచనలనాధారంగా చెబుతున్నారు. కబీరు ఆధ్యాత్మిక జీవనానికి పెద్దభార్య 'ధనియా' సహకరించకపోవడంతో 'లోయీ'ని రెండవ వివాహం చేసుకున్నట్లు చెబుతారు. లోయీ జీవితాంతం కబీరుతోనే ఉన్నట్లు, ఈయన సాధారణ జీవిత గమనంలో నిలవడం వల్ల ఎన్నో రోజులు పస్తులుండవలసి వచ్చినట్లు తెలుస్తున్నది. ఈయనకి ఇద్దరు పిల్లలు, వారు కమాల్ (కుమారుడు) కమాలీ (కుమార్తె). తండ్రీకొడుకుల ఆధ్యాత్మిక అభిప్రాయాలు కలిసినట్లు లేవు. కబీర్ ది నిర్గుణోపాసన, కమాల్ ది సగుణోపాసన.

కబీర్ విద్యాభ్యాసం కోసం ఎక్కువగా కష్టపడ్డాడు. సనాతన హిందూ సంప్రదాయవాదులు ఆయన్ని దగ్గరకు రానీయలేదు. కబీరంతటి వానికి ఈదేశ సనాతన సంస్కృతిలో గురువులే దొరకలేదు. దీనికి ఆయన మతం కారణమైంది. అయితే కుల మత విచక్షణలధిగమించి ఆలోచించి, కబీర్ ని శిష్యుడుగా అంగీకరించి స్వీకరించిన మహానుభావుడు

డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు

శ్రీరామానందతీర్థ. కబీర్‌కి సంఘంలోని దురాచారాలను ఎండగట్టి ప్రపంచానికింత మంచిని బోధించడం గురువునుంచే వచ్చింది. ఇక్కడ నేను కబీర్ ఏం చెప్పింది, ఎలా చెప్పింది చెప్పరావడం లేదు. అది పునశ్చరణే అవుతుంది. కబీర్ దోహాల్లో ఉన్న అద్భుత సారాంశమంతా ముందున్న పద్యాల్లో నాశక్తి కొలది చెప్పగలిగాను.

కబీర్ హిందూ మహమ్మదీయ మతభేదాన్ని బాపి మధ్య రగిలే మంటల్ని ఆపడానికి చేసిన ప్రయత్నం, ప్రపంచ ధార్మిక చరిత్రలోనే అత్యపూర్వమైన సందర్భం. ఏ సాధువుగాని, ఏ విజ్ఞాని గాని తాననుసరిస్తున్న మతానికి చెందిన దైవ ప్రభావం గురించి చెప్పారు, ఆ మతంలో గొప్ప విషయాలు బోధించారు గాని రెండు మతాల మధ్య మండుతున్న పచ్చిగడ్డిని ఆర్పి రామ్ రహీమ్ ఒక్కరేనని చాటిన మహానుభావుడు కబీర్ ఒక్కరే! పది పద్యాలు రాసి మద్రాసు మిత్రులు శ్రీ తూమాటి సంజీవరావు గారు "పద్యప్రకాశం"లో ముద్రించడానికి కోరగా పంపించాను.

"హమరే రామ రహీ మకరీ మా కేసో అలహ రామసతి సోయీ
విస్మిల్ మేటవి సంభర ఏకై ఔర్ న దూ జాకోయీ!"
ఆయన మాటలు తెలుగు నుడికారపు సొంపులో
"అతడు రామచంద్రు డాతడేను రహీము
ఆతడే కరీము అదియె నిజము
విశ్వశాసకుండు బిస్మిల్ల యొక్కడే
అతనికన్న లేదు అన్యమేది" అని తెనిగించాను.

విషయానికొస్తే కబీర్ ఆడంబరం ఎరగనివాడు. ఆయన మాటలకీ ఆడంబరం లేదు. ఆయన రాగజగత్తుకు అతీతుడు. అనురాగజగత్తుకు చేరినవాడు. అక్కడ మాటల ఆడంబరం ఉండదు. మమేకమైన తన్మయత్వమే కనిపిస్తుంది. ప్రభువుతో ఏకమైన పిదప కేళిసౌఖ్యాదులూ ఉండజాలవు. అలౌకిక భగవద్దైక్యత మాత్రమే కనిపిస్తుంది.

"మన్ పరతీతిన ప్రేమరస్, నాయిస్ తన్ మే డంగ్
క్యా జా ణౌ ఉస్ పీవసూ కైసీ, రహసీ రంగ్"
'ప్రేమ రస' ప్రతీతి నా మనసుకు రాదు
తనువు జేరియైన తాకబోదు
ప్రియుని వెలుగు కలసి ప్రేమ రూపము బాసె
మదికి సౌఖ్యమనుట మాసిపోయె" అంటాడు.

నా దృష్టిలో కత్తిపట్టుకు తిరిగేవాడు పిరికివాడు. నిర్భయంగా ఎదుటివాడి దొసగు చెప్పగలిగేవాడే ఈ లోకంలో ధైర్య సంపన్నుడు.

హిందూ, మహమ్మదీయ మతాలపేరిట సమాజంలో సాగుతున్న అనౌచిత్య కార్యాలన్నిటినీ కబీరు నేరుగా గర్హించాడు. సమాజంలోని మామూలు అంశాలకన్నా అపారమైన ఏ నియమాన్ని ఖండించినా ఛాందసులు తట్టుకోలేరు. అయినా ఆయన కాలంలో మనదేశంలో వ్యాపించి ఉన్న హిందూ, మహమ్మదీయ మతాలలోని చౌకబారు, హేయమైన చర్యలన్నింటినీ నిర్మొహమాటంగా ఖండించాడు కబీర్. అందుకే ఆయన జ్ఞానవీరుడు. అచంచలమైన ఆత్మవిశ్వాసమున్నవాడు. ఏ విధమైన తడబాటు లేని మహాభక్తుడు.

కబీరు ఇంతటి తాత్త్వికుడయ్యునూ, మహానుభావులకు శిష్యుడయ్యునూ అక్షరజ్ఞానంలేని, రాయడం చదవడం తెలియని వాడని చెబుతారు. దాన్ని పరిశోధకులు కూడ సమర్థించారు. అంటే అశేష జనవాహిని కబీరు దోహాలు, వచనాలు విని, తమ కంఠంలో దాచుకొని అనంతర తరాలకు అప్పగించారని భావించవచ్చు. అంటే వేదాలవలే కబీరు రచనలూ మౌఖికంగా జీవించి ప్రపంచాన్ని ప్రభావితం చేశాయన్నమాట.

నాకు హిందీ అంతగా రాకపోయినా మిత్రులనుంచి ప్రతి పదానికి తెలుగు తెలుసుకొని, నిఘంటువుల సహకారం తీసుకొని వచనంలో రాసుకున్నాను. చాలాసార్లు చదివి, ముందుగా కబీరు ఆత్మీయతని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాను. అనంతరం తెలుగు నుడికారానికి దగ్గరగా చేర్చుకొని, నాశక్తి

కొలది కృషిచేసి కబీరు ఆత్మీయతకి భంగం కలుగకుండా ఆంధ్రీకరించాలని ప్రయత్నించాను. ఎక్కడైనా లోపం కనిపిస్తే అది నాది. ఎక్కడైనా గొప్పగా అనిపిస్తే అది కబీర్ మహాశయునిది. నన్ను మన్నించి జ్ఞానసంపన్నులైన సాహితీ ప్రియంభావుకులు ఆశీర్వదింతురుగాక!

నిజానికి నాకు ఆధ్యాత్మిక తాత్త్విక వైజ్ఞానిక పరిణత అంతగా లేదు. కాని స్వామి శ్రీ సత్యసాయి తాత్త్వికత, ప్రేమ, సేవ అనే అంశాల త్రివేణి సంగమ సౌజన్యాన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించాక, కబీర్‌ని అనువదించగలననే ధైర్యం ఈషణ్మాత్రం లభించింది. కనుకనే స్వామికి ముందు ప్రణామాలు సమర్పించుకొంటున్నాను.

దివికేగినా నా స్పృహలోనే నివసిస్తూ నన్ను ఆశీర్వదించే నా గురుదేవులు డా. నాగభైరవ కోటేశ్వరరావు గారి సంకల్పబలం తోడుగా నిలిచింది. వారికి అంజలించుకొంటున్నాను.

ఈ ప్రయత్నంలో నన్నాశీర్వదించి నడిపించే నా తలిదండ్రులు శ్రీమతి సుబ్బరత్నమ్మ శ్రీ ఆదిశేషయ్య గార్ల పాదాలకు నమస్కరిస్తున్నాను. సర్వవేళలా వెన్నంటి సహకరించే నాలో సగం విజయలక్ష్మికి, బిడ్డలు సురేష్ బాబు, రాహుల, ప్రహ్లాదుడు, వేదవ్యాసులకు ఆశీస్సులు చెప్పి సరిపుచ్చుకోవడం లేదు.

"నాదతనుమనిశం" పేరుతో నానుంచి మంచినే చూసి, ఆలోచనాత్మకంగా ముందుమాట రాసి ప్రోత్సహించిన నా చిరకాలమిత్రులు గౌరవనీయులు డాక్టర్ అనంతపద్మనాభరావు గారికి ధన్యవాదాలు.

నాకు కబీర్ ని పరిచయం చేసిన మా గురువుగారు, వేమనను హిందీవారికి చూపించిన బహుభాషా పండితులు **శ్రీ ఈమని దయానంద్** గారికి, నా పరిశోధనాచార్యులు సహృదయులు **ఆచార్య టి. గౌరీశంకర్** గారికి నమస్సులు.

ఇంకా ఎందరో ఆత్మీయులు

గుంటూరు వచ్చిననాటి నుంచి నాకెంతో ఆత్మీయ సౌగంధాన్ని పంచి ఎప్పుడూ మంచి మార్గాన్ని చూపించే మా **శ్రీ లంకా సూర్యనారాయణ** దంపతులకు. . . . .

ఎక్కువ మంది కూలిచేసుకునే వాళ్లున్న మా గ్రామానికి ఇంత అన్నం పెడుతున్న మహితాత్ములు **డాక్టర్ బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి** గారికి. . . .

సిలికానాంధ్రలో నన్ను చేరువగా చేర్చుకొన్న తెలుగుభాషా సంస్కృతులకు పుంభావరూపమైన మాన్యులు **శ్రీ మండలి బుద్ధప్రసాద్** గారికి. . . .

సిలికానాంధ్ర వ్యవస్థాపకులు, తెలుగు కళాసౌందర్యాన్ని ప్రపంచమంతా పరచిన సోదరులు **శ్రీ కూచిభొట్ల ఆనంద్** గారికి. . . . ।

నాకూ, మా సృజనమండలికి పెద్ద దిక్కు పండితులు, గురుతుల్యులు
శ్రీ గాడేపల్లి సీతారామమూర్తి గారికి. . . .

నా గురుశిష్యుల్లో నాకు తోడుగా నిలిచిన సోదరులు
డాక్టర్ బీరం సుందరరావు, డాక్టర్ ఉబ్బా దేవపాలన గార్లకు. . . .

నాకెప్పుడూ చేదోడువాదోడుగా నిలిచే, మాయింటి బిడ్డలుగా మేము భావించే
శ్రీ మోదుగల రవికృష్ణ, శ్రీ శెట్లెం చంద్రమోహన్ గార్లకు. . . .

రెండు దశాబ్దాల కాలంనుంచి నాకు రెండు చేతులుగా నిలిచిన
శ్రీ డి. వి. యం. సత్యనారాయణ, శ్రీ గాడేపల్లి దివాకరదత్తు గార్లకు. . . . .

అద్దంకి 'సృజన' సభ్యులందరికీ పేరు పేరునా. . . .

శ్రీ కంచికామకోటి పీఠ **శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవాలయం** పాలకమండలికీ పేరు పేరునా. . . . .

ముఖచిత్రాన్ని అందంగా వేసిన **శ్రీ రాయని గిరిధర్ గౌడ్** గారికి. . . .

ఈ స్నేహగీతల్ని అందంగా ముద్రించిన లక్ష్మీప్రసన్న గ్రాఫిక్స్ ।
శ్రీ పల్లె వెంకటేశ్వర్లు గారికి. . . .

మనఃపూర్వక ధన్యవాదాలు.

మీ విధేయుడు
భూసురపల్లి

అక్షయ పురుషుండు వృక్షమై వెలయగా । నిర్మలుండు కొమ్మ నియతి రెమ్మ । ముగురు మూర్తులు తరు మూలకేశమ్ములు । ఉనికి పత్రకమ్ము నూర్ధ్వ ముఖము 1
అతడె నాదు దైవ మతడె నా హితుడును । అతడె ప్రాణసఖుడు నతడె రేడు । అతడె సర్వమనగ నానంద ముప్పొంగు । అతని తోడు జీవి కమృత సిద్ధి 2
సూత్రధారి యతడు సుగతి రూపమతడు । సృష్టి మూల మతడు దృష్టి యతడు । స్మృతికి బోలు రూపధృతి లేని తేజస్వి । నేను గొల్చు నాదు నేస్త మతడు 3

నాల్గు భుజములుండు నయగారులనుగొల్చి - తత్త్వ మరయలేరు సత్వమతులు - వేయి చేతులున్న వేల్పును పూజింతు - చావు పుట్టు లేని సత్యమతడు 4
రూపు లేనివాడు చూపు తానగువాడు । కనుక దేవదేవుడయ్యు దేహి కాడు । లెక్కలెని వెల్గు లొక్కటై నడయాడు । గగనమంత తాను జగము తాను 5
సగుణ సేవ తెలియ సద్గుణములు హెచ్చు । నిర్గుణాత్మ నరయ నిజము తెలియు ।
అన్ని మార్గ గముల నధిగమించెడి ధ్యాన । భజన విభుని దివ్య పథము చేర్చు 6
ఆవగింజనైన అచలమ్ముగా మార్చు । కొండనైన తృటిని పిండి జేయు । సర్వశక్తి యుతుడు సర్వేశుడొక్కడే । అతని చేయి బడని యణువు లేదు 7
గౌరవమ్ము తనది, గంభీరుడాతండు । అఖిల సృష్టి యతని హస్తభూతి। అణువునంటు తాను అఖిలమ్ము తానయ్యు । అతని చేరు గమ్య మరయగలనె 8
చేతలన్ని తనవి చేయించు నాతండు । శక్తి తనది కర్మయుక్తి తనది । కర్త యతడు మించి కర్తృత్వ మతనిది । అతడు లేని దేది అవని మీద 9
ప్రభువు చెంత జేరి ప్రణమిల్లు వానికి । చింతలేదు ఎట్టి శిక్షరాదు । ఎంద రొక్కటగుచు నెంత తలపడినా । వాని తలను పూవు వాడ బోదు 10
శివుని త్రాసు నందు సిబ్బెలు కనరావు । దారమేది లేదు దండె లేదు । జగములన్ని తూచు జాగారి నా స్వామి । భేద మరయ లేని బేరగాడు 11

డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు

నీవు స్వామి గొలువ నిరుపమానమ్మైన । విలువ గలుగు అతని విలువ చేత -
అతడు గానినాడు అతడు లేడు లేడనునాడు । నీటి గవ్వకైన సాటి రావు 12
జగతి వెదుక నేల ! సుగతికై వగపేల । తావి పూవు నందు దాగినట్లు ।
నీవు వెదకు విభుడు నీయందె కలడోయి । భ్రాంతి తెరలు ద్రుంచు బ్రహ్మమందు 13
మహిని తనువు కొక్క మతము వేరై యుండు । స్వామి కన్ని పనులు స్వానుభవమె
కోర్కె నెత్తి నుండ కొత్త మతములేల । కాంక్ష విడువ స్వామి కరుణ దక్కు 14
నువ్వులందు నూనె నివ్వటిల్లిన యట్లు । రాళ్ళలోన చిచ్చు రగులునట్లు । నీదు ఘటము నందె నిలిచియుండు విభుడు । మేలుకొనుము ప్రభుని మేలుకొలుపు! 15
కంటియందు తార కలిగున్న రీతిగా । సర్వ ఘటములందు సాక్షియుండు । మూర్ఖు లెరుక లేక ముల్లోకము లొలయ । చిత్తమంట బోదు చెకుముకి శిల 16
తంత్రిలేని వీణ తనువునందున్నది । అణగి మ్రోగుచుండు నహరహమ్ము । నాదసాధన మ్మనాహత నాదమై । పరమపథము చేర్చు భ్రమలు బాపి 17
సారశబ్ద శ్రుతులు సాదరమ్ముగ విన్న । కాకి హంసయగును కల్లగాదు । శబ్దమందు జ్ఞాన సారమ్ము గ్రహియించు । బుద్ధ జీవి జ్ఞాన సిద్ధిబొందు 18
ఒకటి ఔషదియగు, నొకటి గాయపరచు । ఒకటి బంధమిచ్చు, నొకటి తుంచు । పలుకు పలుకులోన ఫలితము వేరౌను । చెప్పలేము శబ్ద చిత్రగతులు 19
పలుక నేర్చు వాని పలుకుల సరితూగు। ధనము లేదు మించు ఘనము లేదు। పలుకులందు దివ్య ప్రభలు వెల్లుచు నుండు। పలుకు దూచగలుగు పసిడి గలదే 20
పరుసవేది వోలె పరమాత్మ నామమ్ము । స్పర్శతోనె దివ్య సౌఖ్యమిచ్చు । చిత్తక్షోభ బాసి చిరుదివ్వె వెలిగించు । మోహబంధ వితతి నాహరించు 21
ఆదినామ మహిమ అసలైన మూలమ్ము । అన్ని మంత్రసిరులు అందు బుట్టె । నామ మహిమ లేక నడచు జ్ఞానము లేదు । నామకలిమి మనిషి క్షేమమరయు 22
నామరత్న సిరులు ప్రేమకాస్పదమోయి । మూలధనము పసిడి మూటగట్టు । గాన జపమునందు జ్ఞానదీపము వెల్గు । గాయకుండు తాను గ్రాహి తాను 23
అన్ని రసము లందు మిన్న నామరసము । ఎడము సేయలేవు విడువలేవు । స్పర్శతోనే తనువు పరుసవేది యగును । నాద నామక్రియకు వేది యగును 24
నరుని హృదయమందు నామమ్ము నంటెనా । పాప మంతరించి ఫలము దక్కు । ఎందు గడ్డి బడిన మండు సమిధవోలె । పొల్లు తొలగి ఇంత పుణ్యమబ్బు 25
రామనామ సుధల రమియించు చిత్తమ్ము । మాయనంట బోదు మార్గమందు । రాసమండలమును దూసుకొనుచు బోయి । చేతనాత్మ లోనె చేరిపోవు 27
సూత్రమొరిగిపోవు శూన్యమ్ము నసియించు । మనిషి మాయమగును మంత్రముడుగు. రామభక్తి యొకటె రహియించు జగతిలో । సామమెరుగు వాడు రాము నెఱుగు 28
అణువు అణువు నందు ఆనంద రూపమై । వెలుగుచుండు నాదు విభుని రూపు । అతని కాంతి వెదకి అతనిలో లీనమై । వెలుగు లందు చేరి వెలిగిపోతి 29
ఆకసమ్ము నందు నమరె నొక్క సరసు । మనసు చేప అందు మసలుచుండు । సుధలు గురియు గాని సూత్రధారియె లేడు । అతని మార్గ మెవ్వరరయ గలరు ! 30

డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు

కలను ఇలనుగాని కలవరింతను గాని। తెలిసి గాని తనకు తెలియకైన।
నామ ముచ్చరించు నరునకిదే నాదు। అజిన మొలిచి చెప్పు నమర జేతు
విభుని వెదికి వెదికి విశ్వమంత తిరిగి। కడకు ఆత్మ నందె గాంచినాడ।
విభుని గనిన పిదప విశ్వమ్ము ముంగిటే। కోరకుండ తానె కొలువు దీరె 31
శివుని చేరి జీవి చేతన మ్మగునాడు। అంతు లేని వెల్గులవతరించె। వెల్గు లేకమైన విభవమ్ము ఎదలోన। సర్వసృష్టి సూత్ర సారమిచ్చె 32

చిక్కె ధ్యాన మందు చిత్తమాకాశమై। చేరదాయె తిరిగి చిత్తభ్రాంతి। నీట గలియు ఉప్పు నీకెట్లు లభియించు। నిజము చెప్పుచోట ఋజువు లేల 33
అహము విడిచి ప్రభుని కనురక్తుడైనాను। అంతరంగ మంత శాంతి నిండె। అజుని చెంత సుంత నాదర మ్మది దక్క। ఆశలేల ? నింక పాశమేల ? 34
దైవ పంజరమున దరిచేరు రాముండు। ప్రథిత భక్తిభావ ప్రాపు లోన। హాయిగ నిదురించు అంతరంగ జ్యోత్స్న। పలుకులందు ప్రేమ కులుకులాడు 35
కారు మబ్బుగములు కప్పుకున్నవి మింట। మేఘ గర్జనములు మెరుపు పంట। అందు కురియుచుండె నమృతంపు ధారలు। తనివిదీర నేను తడియుచుంటి 37
వెలిగె జ్ఞానదీప్తి కలిగె బ్రహ్మస్ఫూర్తి। మానసరసి(సహస్రారం)చేరు మార్గ మొదవె।
హంస(జీవుడు) మందు చేరి అన్వేషణము సేయు। మౌక్తికమ్ము(ముక్తి) చిక్కె మరులు(బ్రహ్మానందం) దక్కె। 38
ఆత్మశూన్యమందు అల్లుకున్నది యిల్లు। అందు అమరనాద మమరి యుండె। లోక మేలువాడు లోచనమ్ముల కంద। దేహమంత మంచి దీపమయ్యె 39
మానవుండు తాను మార్పు వాంఛించినా। బ్రహ్మరాత లందె బ్రతుకగలడు। నీరు చల్లబరచి నీహారముగ మార్చ। కరగి నీర మగుటె కడకు మిగులు 40
గురుని సాయమంది గుణము లదుపు జేసి। దేహమందు నామ దీపముంచి। ప్రభువు దర్శనమను విభవ మనుభవింప- ఆపదలు తమంత అరచి చచ్చె 41
తలపు నిండియున్న వలపు నేలబరచి। దాని పైన నడచి దరికి జేరు। ప్రేమ జీవనునికె ప్రియుడు తా దొరకును। భక్తిలోని మర్మభావ మిదియె 42
ఆత్మజ్ఞాన సుఖము నరయ తేలిక గాదు। చెప్పుకొనుట కెట్లు చేత కాదు। మూగవాడు తిన్న ముదురు బెల్లపు జీర। తెలియజేయలేని తీపి గురుతు 43
నీకు నాకు మధ్య నిండిన దూరమ్ము। లెక్కలేదు నాకు చక్కనయ్య। నింగి చందమామ నీటి కలువ ప్రేమ। అంద దనుట విధికి నలవియగునె 44
జ్ఞాని మూర్ఖుడగును, జ్ఞానియౌ మూర్ఖుండు। రిక్తపూర్ణ భేద వ్యక్తమేది !। అనుభవమ్ము చెప్ప నలవి కానిది సుమ్ము। అనుభవించు టొకటె ఆత్మసాక్షి 45
చేట వంటి వాడు చిత్తు నెరుగు సాధు। మేలు పొంద గలడు తాలు విడిచి। సారమెరుగు వాడు దారులన్ని దాటు। తత్త్వసార సిద్ధి దైవసిద్ధి 46
పచ్చికొయ్య వోలె పరువంపు విరహిణి। పొలయు టెడద వేగి పొగనురాజు। విరహబాధ సడలి ప్రేమబాసిన నాడు। ఎండుకట్టె వోలె మండిపోవు 47

సాధువెందునైన సారమ్ము గ్రహియించు । చెడును సుంత చెంత చేరనీడు ।
హంస పాలుగ్రోలి అంబువు(జలము) విడనాడు । సత్యమందు నిలుచు సాధువెపుడు 48
ఎన్ని రూపములను ఎంతెంతొ దర్శించి । భ్రమల బడితి గాని ఫలము లేదు ।
రామ దర్శనమున కామమ్ము కడతేరె । సాటి లేని రత్నపేటి దొరికె
అన్ని జీవులందు ఆదరమ్మును పంచి । సమత నేర్పువాడు సద్గురుండు ।
ఆత్మలన్ని యొకి అభవుండు నొక్కడే । సత్య మరయు మోయి సామ్యదర్శి 49
లోకబంధనమ్ము శోక కారణ మౌను । రాగమందు దాగి భోగముండు । తగిలియున్న గాఢ తమము తెగిననాడె । ముక్తి గలుగు దాస భక్తి గలుగు 50
సహజమైనదేది సహజము కాదేది ' ఎవరు చెప్పగలరు ఇట్టి నిజము । ఎద్ది ప్రభుని చూపునది సహజమంచు । చెప్పగలను! మెప్ప జెప్పగలను! 51
కృతక భక్తి జీవభృతికి తోడ్పడు గాని । ఆత్మ ఛాయనైన నంటబోదు । ఇరుకుబడ్డ పాము పొరను వీడినటుల । మోసకారి భక్తి మోయలేదు 52
పూర్ణజ్ఞాని గాక బోధకుండైననూ । భక్తి నెట్లుగాని పొందలేడు । ఎదయు తనియబోదు సదయుండు చిక్కడు । విద్య కృతకమైన వెలుగు లేదు 53
పరులు చిత్తమెరిగి పరిశోధనలు చేయు । శోధకుండు నాకు బోధగురువు । చిత్త మరయ గల్గు సత్తయున్న స్థిరుడె । శివుని గాంచగలడు భవమునందు 54
ఆరువర్గ తతుల కాస్పదమ్మగు నాడు । భక్తి చిక్కబోదు ముక్తి రాదు । జాతి వర్ణ భేద జాడ్యమ్ము విడనాడు । శూరు డెప్పుడైన చేరు శివుని 55
సురభి జింక మర్మ మరయలేడా రాము । డిట్లు చేయనేల ఎరిగి యెరిగి । రాపునందె జాతి రత్నకాంతి తెలియు । సాక్షి ఎరుగలేని చాటుగలదె 56
నిరుపమాన భక్తి నిష్కామ ప్రేమతో । నిండి యెల్లవేళలుండ గలదు । కామమందు భక్తి ధామము చేరుట । సాధ్యమగునె ఎట్టి సాధుకైన 57
రాజుపేద లేదు, రక్తిశక్తియు గాదు । భక్తి నెవ్వడైన బడయ నోపు । మనసు నిల్వగల్గు మతిమంతుడౌ చాలు । భక్తికుదురు వాని భాగ్య గరిమ 58
నామ స్మరణ మందె రామసాధన యుండు । ప్రాణముండు వరకు ప్రణవముండు । ఉసురు గోలుపోయి ఊరేగు నాడైన । ప్రాణధ్యాన వెరవు(విధము) పదిలమగును. 59
చింత తగులుకున్న చేజారదెన్నడూ తెగునుగాక నాల్క తిరుగులేదు నిప్పు మింగి నట్టి నెలపులుగె(చకోరము) పుడైన బాధపడిన జాడ పట్టలేము 60
నీవు నీవటంచు నీలోన గలసితి । నీవులేని దేది నిజము గాదు । నీవు లేక రామ ! నేనునూ లేనన్న ! । సత్య మరసి నాడ సర్వసాక్షి 62
అరయ ధనము గల్గు నర్బుద (దశకోటి) ఖర్వమ్ము(సంఖ్యామానం) । రవియు సోకువరకు రాజ్యముండు ।
ఎంతయున్నగాని సుంత నీతో రాదు । భక్తి ధనమె ధనము ముక్తి హితము 63
సకల కర్మలన్ని సారమై నిలిచి తా । ధర్మబంధనముల దారిచూపు । నిండు భక్తి యొకటె నిష్కామ కర్మమ్ము । బంధనములు తుంచి భక్తి నిలుపు 64
బ్రతుకు నీకు వరము, భ్రమలు చేరగనీకు । బంధనములు పెంచి బాధపడకు । ప్రేమనిలయమిద్ది పిన్నమ్మ యిలుగాదు । బుద్ధి నదుపు జేసి శుద్ధి పొందు 65

పగటి వేషములను పలుమారు వేసినా । భ్రమలు మాయలేదు శ్రమలు తప్ప ।
ప్రభుని కరుణ లేక ఫలితమ్ము రాబోదు । అతని చిత్తమందె అభయముండు
చెట్టు కాయ గాదు సేద్యాన పండించ । సంతలోన దొరకు సరుకు గాదు ।
రాజు పేద భేద రాహిత్య భావమ్ము । నెదను పెంచి ప్రేమ నెరుగవలయు 67
క్షణము హెచ్చి మరియు క్షణికమై క్షీణించు । భేద వర్తనమున ప్రేమరాదు ।
పంజరమున నిండి పరిపూర్ణ దీపమై । వెల్గుచుండు దివ్వె ప్రేమ జ్యోతి 68
అహము కలుగునాడు అధ్యాపకుండుండె । నేడు అహము విడువ లేదు గురుడు । చూడ ప్రేమ ఎంత సూక్ష్మమార్గము నుండె. ఇరుకుసందు నిద్ద రిమడ గలరె! 69
ప్రేమ లేని హృదయ మేమనంగ గలము । రోదనమ్ము నొదవు రుద్రభూమి. ఉసురు(శరీరం) లేక నెటులో ఊపిరాడుచు నుండు. కొలిమితిత్తి వాని కలిమి మేను 70
కపటి చెంత నుండి కడుదవ్వు యోచించు । మాట చెప్పుటొకటి మర్మమొకటి । రాముడెక్కడున్న రాజిల్లు నా ఎద । రాచముంగిటున్న రామచిలుక 71
సద్గురు కిలలోన సాటి ధనము లేదు. ధరను తపసి మించు దాత లేదు, అవని జాతి లేదు హరిభక్తులకు మించి । హరికి మించి హితుని అరయలేము 73
మనసు నిండిపోయె మధురమౌ ప్రేమతో । దేహమంత రాగ దీపమాయె । పలుకు లందు ప్రియుని పలకరించుటె గాదు । శ్వాస కూడ అతని ధ్యాస నుండె 74
నీదు దొసగు దెల్పి నిలకడేమిటో చెప్పు. శాస్త(గురువు) దొరకడేని శ్రవణమేల? తిరిగి నీరు ద్రావు తీరౌను బ్రతుకంత. అరసి ఎంచుకొనుము ఆఖ్య(గురువు)వరుని 75
ప్రేమ యొక్క వైపు ప్రీతి(అభిమానం) మరొక వైపు । ఎట్లు నొక్క ఒరను యిమడగలవు - ప్రీతి విడిచి దైవప్రేమలో జీవించు । ప్రణయజీవి నెపుడు ప్రభువు విడడు. 76
గురుని బోధ వినుచు గురుతు నెరుగు, అందు । కోర్కె లేదు లౌక్య కూర్మి లేదు । కుండ కాలిన తరి కుమ్మరి చక్రమ్ము । తిప్పనేల దాని చొప్పు(అవసరం)దేల 77
అన్ని రసములందు మిన్న ప్రేమరసము । ప్రేమ కన్ననేది ప్రియము కాదు । ఒక్క బొట్టు మేన చిక్కితే చాలును । అన్ని తత్త్వశాఖ లభ్ర(మెఱుపు)మగును 78
నామ రసము నందు ప్రేమ నిలిపినాను । ప్రియుని జూడ మదికి పిచ్చిబట్టి । ముక్తి యిమ్మటంచు మొరబెట్ట నాకేల । ఏది యివ్వ దగునో నెరుగడేమి ? 79
అజుని చేరుటన్న అంత సులువు గాదు । చేరి ఎవరు గాని వేఱు గారు । అరులు గలుగు వాని పరమాత్మ ఎరుగడే । విభుడు వానినేల విడిచిపెట్టు 80
అరులు కలిగినట్టి అనుబంధమే గొప్ప । ప్రేమ లేని పొందు పెద్ద కల్ల । కూర్మి లేక తనువు కూడియున్నను గాని । ఫలము లేదు ప్రేమ బలము రాదు 81
కన్నులనెడి గదిని కనుపాప పాన్పుపై । కంటిరెప్ప తెరను కట్టియుంచి । విభుని నిలుపు కొంటి వీక్షణమ్ముల యందు । ఏల తొలగి పోవు లీలనైన 82
మరణమన్న భయము మరులంద నీయదు। నిహతి(మరణం) సత్యమన్న నియతి తెలిసి। మరణ భయము దక్కి మనగల్గు ధీరుడే। ప్రేమ పంచి విభుని ప్రియతనందు. 83
హరిని ప్రేమ మీర నారాధనొనరింప । ధనము నిచ్చు, కీర్తి ఘనము నిచ్చు - హరిజనులను గోరి ఆశ్రయించిన నాడు । ఆదరమున దెచ్చి హరిని యిచ్చు 84
తనువు కెంత దవ్వు దాగియున్నను గాని । తరుగులేదు నాకు ధరణిధారి । కనులకందకున్న కానిదేమున్నది । నాదు మదిని విడిచి నడువగలవె 85



మూగవాని సైగ మూగకే తెలియును । జ్ఞాని కెఱుక గల్గు జ్ఞాన సుఖము నాదువిభుని ప్రేమ నా మది కెరుకయే ।
అన్యమేది నాకు అంటబోదు సారసాక్ష నీదు దూరము నిజమైన । లేఖ వ్రాసుకొందు, లేమనౌదు! ।
తనువు మనసు నీదు తమకమ్ముతో నిండ । ఏమి వ్రాయవలెనొ ఎరుగనైతి 87
అగ్ని తాపమైన ననుభవించగ వచ్చు । తాళవచ్చు ఖడ్గధారనైన ।
ఏకమైన చెలిమి నెట్లు నిభాయింతు । నీదు పొందులేక ! నిజము సామి ! 88
తత్త్వ మరయబోయి తమకాన పడబోకు । తర్కమేల నీకు ? తనువునిమ్ము, ।
శిరము నిమ్ము గాని చిత్తమ్ము నిడబోకు । నిబ్బరమున ప్రేమ నింపుకొనుము 89
సత్తుగాజు వంటి ఒత్తిడి కోర్వని। పిరికి వాని యందు ప్రేమలేల?। ఒరపుకోర్చి నిల్చు సురభి(బంగారం) హీరమ్ము(వజ్రం) । అట్టి విభుని నెమ్మి యమృత మయము 90
నికష(ఒరిపిడి) మొరిసి బిట్టు నిలిచిన వానికే । సార శబ్ద వినికి(వినుట) సాధ్యమగును । అట్టి జాతి మాది అనుమాన మేలరా । అందు నీవు కూడ నడుగు బెట్టు 91
మన్ను తొక్కు కొనుచు మిన్ను చూడగనేల । నిన్ను అదను జూచి మన్ను కప్పు । మూడునాళ్లలోన ముగియు నీ జోరెంత । మట్టి తిరము నిజము మరవబోకు 92
కామచారి ఎపుడు కవయుస్మరణమందె । నిలిచి యుండు, విడువ నేరడెపుడు । అట్లె రాత్రి పవలు అంబుజాక్షుని చింత । మునిగితేలు వాడె ముక్తి నొందు 93
హరిణ మెపుడు నాద హర్మ్యాన వసియించు. మని(బ్రతుకు) కి భారమైన మానబోదు. మనసు లయము చేసి మధుసూదనుని దల్చి. తలపు నందు నిలువ తరుగులేదు 94
నోరు మెదపరాదు నోము విడువరాదు - ఎడదలోని తలపు నెడయ రాదు । వెలుపలి తెరనెపుడు వేసియుంచి, నిరత । మంతరంగమందు అజుని కొలువు 95
ప్రేమ పక్వమైన పిచ్చివాడు విదుడు । ప్రేమ పండినపుడే రాముడుండు । పచ్చి ఆవగింజ పచనంబు చేసిన । తైలమెట్లు పైకి తేలగలదు 96
మనసు నందు తిరుగు మాల ‘మనోమాల’ । కోరి చేత తిప్పు కొయ్యదండ । చేతిసరము తిరుగ చిద్విలాసుడు దక్క । భాగ్యమెంత పొందు బావిగిలక 97
కొయ్యపూస జేసి కొలకు తీగను జుట్టి । ముడులు మెలిక వేసి మురియనేల ? । మనసు లోని మాల మనతోనె తిరుగాడు । శ్వాసలోనె కలసి వ్యాసముండు 98
సహజనాద సుధలు సౌందర్య రూపమై । అహరహమ్ము హృదయమందు మ్రోగు । స్మృతిని గలిసె సూక్ష్మధృతి గల్గు శబ్దమ్ము । వాదమేల వొట్టి వాక్కులేల ! 99
చేత మాల తిరుగు, జిహ్వ నోట తిరుగు, । మనసు దిశల బట్టి మరలి పోవు । తనువు నందు విభుని తలపులే లేవాయె । రాముడేల కనికరమ్ము జూపు 100
స్మరణ ధ్యాన మందు స్థిరముగా నున్నచో । మనసు నిలుచు, నందె మాట నిలుచు । తనువు నిలుచు నందు తపమునూ స్థిరమౌను । తన్మయత్వ మొందు తనకు తానె 101
జపము చేయువాడు, తపము చేయని వాడు । నాదభోగి మరియు నాదవిముఖి । అందరూ మరణము ననుభవింతురు గాని । శబ్ద స్మృతిని వీడ సాధ్యమగునె 102
ఆకు కొమ్మనుంచి అలవోకగా రాలు । తిరిగి కొమ్మచేరు తీరులేదు । మళ్లి దొరకబోదు మానవజన్మంబు । చక్కబెట్టు కొనుము జన్మఫలము 103
నీవు నీవటంచు నీవు నేనై పోతి । ‘నేను’ విడిచి నేడు నిలచి యుంటి - శూన్యమందు నామ సుధలు నింపుకొనగ । దిక్కులన్ని నీవు దిక్కు నీవు 104

గుణము లెంచువాడు గుణహీనుడే యౌను । గుణము లెరుగ విభుని గురుతు తెలియు ।
తేనె తీయదనము తెలిసి గ్రోలెడు రీతి । అజుని పలుకు తీపి ఆత్మకెఱుక.
నన్ను గూర్చి చింత నాకున్న ఫలమేమి । చింత బొంది ఏమి చేయగలను? ।
నన్ను గూర్చి శౌరి యెన్నగావలె గాని । స్వార్థ చింతనెపుడు వ్యర్థమవదె ! 105
మూటగట్టనేల? మురిపె మందగనేల? । పొట్ట కోరునంతె గిట్టునోయి ।
ముందు వెనుక నీకు మురహరి కలడోయి । అడిగినప్పుడెల్ల అతడె యిచ్చు 106
తెల్లవారె నదియె వెల్ల వెల్లుల సృష్టి । కోట్ల ప్రాణి కోటి కూర్కు దీరె । ఇన్ని కోట్లమంది కెవరిచ్చె సరితిండి ?। చింత నీదటన్న వింతగాదె ? 107
అన్ని యిచ్చువాడు అతడేమి వ్రాయునో । తలలు బద్దలైన తప్పబోదు । ఎదియు నెవరి కర్మ మదియె జరుగుచుండు । సంచితమును ఆశ మించనేల? 108
చాలినంత యిమ్ము జాస్తిగా నిడబోకు। ఋణము బంధనమ్ము గుణము(ధర్మం) గాదు। పరమహంస ఎపుడు బాకీన పడరాదు । బలము నీవు, దాని ఫలము నీవు 109
కుంద(మల్లె)వృక్ష మోయి అందమైన తనువు । ధనము వాసనగును మనసు తేటి । నామసుధల తడిసి నమ్మకమ్మును పండె । దారి దొరికె ఉనికి దరియు దొరకె 110
పాట పాడినంత పరమాత్మ దొరకడు । పాట యొకతె విభుని బడయబోదు । నమ్మకమున ప్రభువు నట్టింట నడయాడు । నమ్మకమును మించు నెమ్మి కలదె ? 111
ప్రభువు నా విరహము పరిహరించును లెమ్ము । విరహ మందు బాధ విభుడెరుంగు । చేప నీరు లేక యే పగిది మనును ?। ప్రేమభక్తి లోని పెనుపు గనుము. 112
ఎదురు జూచి చూచి ఎంతకూ గనరాక । కనులు మబ్బులగుచు కరగి పోయె । పిలిచి పిలిచి నాల్క పిడచ గట్టెను గాని । ఫలము లేదు ప్రియుడు బలుకలేదు 113
కడుపు బట్టినంత కబళమ్ము సమకూర్చు । ఒడలు గప్పునంత మడుపు చాలు । పోగు చేయువాడు పూజనీయుడు కాడు । దైవ కృపను తప్పి దక్కబోదు 114
నిన్ను వెదకి వెదకి నినుజూడ తపియించి । నిర్మలాత్మ నిట్లు నిలిచినాడ । శ్వాస నిన్ను చేర నాస గొన్నది సామి । శాంతి లేదు ఎలమి కాంతి లేదు 115
కాలసర్ప మొకటి కాటువేసె తనువు । ఎట్టి మందుగాని పట్టలేదు । అదియె భక్తి విరహమనుచు తెలిసెగాని । తీరు మార్గమేది తెలియదాయె 116
కుటిలమైన మాట జటిలమైన శరము । కర్ణమందు జొచ్చి కలకబెట్టు । సవ్యమైన మాట సకలజనుల గాచు । ‘‘సుద్ది’’ శుద్ధమౌట సుకృత మోయి 117
తనువు ప్రమిద, అందు తైలమ్ము రుధిరమ్ము । జీవవత్తి వేసి చెలువు మీర ఆత్మ వెలుగు నందు నరయ వేడుచునుంటి । ఎదురు చూడలేని ఎడద నాది 118
విరహి నగుచు నిన్ను వీక్షింప వేచితి । కామ మెంత చేదు రామరామ । కాయము బరువయ్యె కరుణించ రావయ్య । నామ మొకటి నిలిచె సామరూప. 119
నవ్వులాట లందు నాధుండు దొరకడు । ఆర్తి లేని చోట అజుడు లేడు । ఆటపాటతోటి అభవుండు దక్కిన । భాగ్యహీను లెవరు వసుధ మీద 120
మాయలాడి మాట మధు బీజపుష్పమ్ము(దానిమ్మ పువ్వు)। అంతరమ్ము తెలుపు అంచు ఎఱుపు। తీపి పూత బూసి తీరుతీరుగ బల్కు। కఱటి మాటనమ్మి కఱగిపోకు 121
కనుల ప్రేమ నిలిచి కారుణ్య సిరి పొంగె । నీరు చుట్టు ముట్టి నిండి పోయె । నీవు వచ్చి పిలువ నిను గాంచు టెట్లొకో । తెలియలేదు ప్రేమ తెరల మధ్య 122
దేహ సుఖము కోరి దేవులాడెడి వాడు । పరమ ప్రియుని ఉనికి నరయలేడు । ప్రసవ బాధ లేక పసివాని నీల్గాడ । సాధ్యమగునె ఎట్టి సాధ్వికైన 123

ధరణి యాకసమ్ము దవ్వెంత యుండునో । భక్తి వేషములకు బంధమంత ।
భక్తిగలుగ గురువు పాద సేవ దొరకు । వేషమందు లౌక్య శోష దక్కు
కొండ కొండ తిరిగి కోయంచు పిలిచితి । ఏడ్చి యేడ్చి కనులు పూడ్చుకొంటి ।
ఆయువంత తరిగి ఆవిరయ్యెను గాని । హరిని చేరు మార్గ మరయ నైతి 125
పుట్టె నెడదలోన పొగలేని దావాగ్ని । కాలిపోవుచుండె కాయమంత ।
వగచునెవని గుండె వానికే తెలియును । చూచువాని కిద్ది చోద్యమగును 126
నామ జపము చేసి రాముని కొలిచేటి । మనసు గలుగు కోట్ల జనులలోన । కాంత కనక మనెడి కనుమలధిగమించి । గమ్య మరియు వాని కానగలమె? 127
ఇష్టునరయ లేక కష్టమయ్యె నెడద । తల్లడిల్లు చోట తపము గలదె । పవలు రేయి లేక పరితాప మందినా । పుడమి ధవుని రూపు పొడమదాయె 128
స్వామి కొలుచు టందె సారముడిగి పోయె । కాశ్యపమ్ము(మాంసం) చివికి కాలిపోయె । కాని తనువు కేమి కష్టమ్ము కలగదు । ప్రభువు సేవ కొఱకె పలవరించు 129
విరహ మెరుగలేక విశ్రాంతి గనినంత । కించ పరచ వద్దు కొంచమైన । వలపులేని కట్టె వల్లకాటికి దిబ్బ । ఎడము లేక రాదు యెలమి ఫలము 130
పగలు రాత్రి గడచి పలుమాసములు దాటి । కాల గమన మెంతొ కరిగిపోయె । విభుని చూడలేని విరహిణి దుఃఖమ్ము । తాళలేక తనువు తత్తరిల్లె 131
గురుని నెనరు దక్కి గురుతు నాదగునాడు । నామమందు భక్తి నాటుకొనెను । నామ మెచట పండు రాముడచట నుండు । గాననదియు గురుని కరుణ గాదె 132
మనసు స్వచ్ఛమయ్యె, మరులు దూరములాయె, । భ్రాంతి మాసిపోయె, భీతి పోయె. అన్ని విడిచి పెట్టి ఆనందమున మునిగి. సంతసించు వాని సాటి ఎవరు? 133
ప్రాణముండు వరకు పరితపించెద గాక । ఫలితమేమి టగునో ప్రభువెఱుంగు । రామదర్శనమ్మె ‘రస’పుట్టు ఫలితమ్ము । ఊపిరుండగానె నొడయుగాక 134
నిహతినంది పిదప నిను నేను కలసిన । అలుపుగాక రామ అమరునెద్ది । మట్టి గలసిపోయె ఎట్టి లోహమునైన । పరుసవేది వలన ఫలితమేమి 135
సత్యమెవనికేని సమ్మతి కాబోదు । కల్లపట్ల మోజు కలిగియుండు । పాలు తిరిగి తిరిగి పలుచోట్ల అమ్మంగ । కల్లు ఉన్నచోటే చెల్లిపోవు 136
నన్ను మరచిపోయి నాలోని ప్రేమను । ఉత్తరించబోకు విత్తధారి । ఎట్టివేళ యైన ఎడబాటు నోర్వను । బ్రతుకునందు గాని మృతిని గాని 137
తనువు మనసు గాల్చి తత్త్వమరయగల్గు । జీవు డెంత విరహ భావుకుండు । సుఖము దుఃఖమందు సూక్ష్మమై యున్నట్టి- వేద విదుని మరచు వేళ గలదె 138
తనువు గాయపరచి తత్త్వమ్ము తెల్పెడి । పరశు వగును విభుని వలపువంత । విరహమతిశయించి పరలోక గతమైన । భ్రమలు తొలగిపోవు, ప్రమద పోవు 139
అక్షరునకు నిద్ర అంతర్హితమ్మయ్యె । నీలవర్ణ శక్తి నీటజేరె! । శబ్ద ముద్ర చేరి చైతన్య జ్యోతియౌ। నందు ముగురు మూర్తు లవతరించె 140
విరహ బాణఘాత మురమున నాటుచో । ఎట్టి మందులైన పట్టబోవు । అరచి అరచి యతడె ఆత్మశాంతిని బొందు । తన్ను కొనుచు తానె తరుణ మెరుగు 141
చేత లరయబోకు చేయి విడువబోకు । వి’భవ’ సాగరమున వేగుచుంటి । తామసంపు శరధి దాటించకున్నచో । మాయ నన్ను బట్టి మేయునయ్య 142

లోకమంత నీవు లోన నీవుండగా । చేసిన దొస గెట్లు చెరిపి వేతు । ఎదుట తప్పుచేసి యేమని ప్రార్థింతు । సిగ్గు గల్గుచుండె చిద్విలాస 143
దూసరములు(దుమ్ము) సోకి కేసరమ్ము చెఱచు । కలుపు చేరి పంట కలిమి చెఱచు ।
సరస మెరుగ లేక సభను చెఱచు వక్త । భావ లాలసుండు భక్తి చెఱచు
పుట్టినపుడు నేను పోకిరినై యుంటి । పెరిగినట్టి తీరు వెరవు(అనుకూలం) గాదు ।
దోషహరుడ వీవు దుఃఖ నాశకుడవు । చేయినిచ్చి దరిని జేర్చుకొనుము 144
అవగుణములు నావి అపరాధి నేగాను । ఆజ్ఞ నీది నాది యనుభవమ్ము-
ముందు శివుని ఆజ్ఞ లేక చీమకుట్టదు గదా! లజ్జపడగ నింక లాభమేమి ? 145
అడ్డమెందరున్న అనుబంధమును నెంచి । ప్రేమ పంచవయ్య రామచంద్ర । కొలుచు వారికేమి కొదువ నీకగునయ్య । నీకు కోట్లమంది ! నాకు నీవే ! 146
అంతరాత్మ గమన ! ఆధారమే నీవు । నిన్ను మించి వేరు నెమ్మి నెరుగ । నీవు చేయి విడువ నిలుచునా నాజన్మ । ఏరుదాట జేయు యేదుగడవు 147
నేను నిన్ను జూడ నీ చిత్త మెక్కడో । ఒక్క మనసు కిన్ని దిక్కులేల ? । నిజము నరయ రామ, నీవెక్కడుందువో । అన్య లెరుగ గలరె ఆదిదేవ ! 148
ప్రేమ తెలియలేని పిచ్చి వాడను నేను । తనువు నందు చక్కదనము లేదు-మరులు పొందగలుగు మర్మమైనను రాదు. భారమంత నీది ! ఫలము నీది ! 149
నాదు దేహమందు నాదైన దేదియూ । కానరాదు నీదిగాక దేవ ! । నీదు సొమ్ము నిట్లు నీదరి జేర్చంగ । బాధయేల నాకు భాగ్యశాలి 150
సుఖము దుఃఖమెవని చూపులకు చేరవో । అట్టివాని చెలిమి నందుకొందు । అతని కలిసి యాడి అతని కలిసిపాడి । అతని తోటి బ్రతుకు ననుసరింతు 151
ప్రేమ మీర ప్రియుడు పిలుచుచుండెను గాని । పిలుపునంద లేని పేద నేను । మలినమైన ధనము మాధవునికి నిచ్చి । శివుని అపరిశుద్ధు చేయనేల? 152
చవిటినేల విత్తి సాగుజేసెడి చోట । ఎంత వానకురియ నేమి ఫలము । ప్రేమలేని వాడు రామనామ భజన । మెంతజేయుగాక నేమి ఫలము 153
ఎన్నడైన గాని ఈశ్వరుం జూడవు । తలచ చోటు లేదు తలపునైన । ఎట్లు తెలియు నాతడెక్కడ నుండునో । దారి గాన లేక చేరగలవే ! 154
చీమలైన గాని చేర నేరని చోట । ఆవగింజ కెచట తావు లేదొ । అచట మనసు నుంచి అజుని ప్రార్థించుచో । పరమ పథము చేరు తెరవు దొరకు 155
నడచు మార్గమందె నడవడి వికసించు । దారులెన్నియైన ధర్మమొకటే । బాటసారి తప్పు బాట తప్పందుమా । దారి సాగు నాడె తీరు తెలియు 156
సుత్తిదెబ్బ కోర్చి ఒత్తు కాగినపుడే । వన్నె వాసి కలిగి వజ్రమగును । ఎదురు దెబ్బకోర్చి ఎత్తు కెదిగినపుడె । మనిషి శక్తి వెలిగి మాన్యుడగును 157
ఒకటి పొంద గోరు సకలమ్ము నీదౌను । అన్ని కోరుకున్న అందదేది । మూల మరసి పూని కొలువగ లభియించు । పూలు పండ్లు బడయు పొలుపు మిర. 158
ఎఱుక గల్గు చోట ఎట్టి చందనమౌను । గుఱుతు లేక మోదుకుజమనంద్రు । కాలినపుడె దాని కమ్మని గంధమ్ము । తెలియగలదు శక్తి తేలగలదు 159
స్పర్శ దీపమౌచు సారమ్ము (సంసారము) వెలిగించు। లోకయాత్ర కాలలోహ(ఇనుము) మగును. నామ దీపమందు ధీమతమ్మది ఎంత? ఎట్టి బంధమైన నెదురు రాదు 160
కోట గట్టినాను కాటుక గదియించి । అందు నిలుపుకొంటి నమృతమయుని । ఎందు దాచుకొన్న నెక్కడ తానున్న । రాము నంట గలుగు రంగు గలదె ! 161

రాళ్ళలోన దాగి రత్నమ్ము నెలకొన్న। ప్రజలు దాని జాడ పట్టలేరు।
శోధకుండు రత్నసూక్ష్మమ్ము గ్రహియించి। వెలికి తెచ్చి దాని వెలుగు చూపు 162
చేప నీరు కోరు శిశువు తల్లిని కోరు। లోభి కాసునరయు లోకమందు।
భక్తుడెపుడు కోరు భగవాను నామమ్ము। ప్రియము గల్గు చోట ప్రేమయుండు 163
సజ్జనుండు రత్నశోధకుండన చెల్లు। రాముడొక్కడె యిల రత్నహితుడు।
రామరత్న మహిమ రాజశీలుడెరుంగు। ఇతరు లెరుగ నేర రెంతకైన 164
మన్ను కప్పి యున్న మాణిక్యమును జూచి। మూర్ఖుడెవ్వడైన ముట్టు కొనునె।
రత్నమరయగల్గు రసవేది గ్రహియించు। మన్ను తొలిచి జ్ఞానమణిని పొందు 165
నామరత్నమనెడి క్షేమమౌ ధనముండె। సత్పురుషుల ఎదను సదయ సుధల। దానమిచ్చుటకును దాపునుండిరి గాని ।అడుగు వాడెలేడు అవని మీద 166
కలియుగమ్ము నందు కర్మతెలియు తప్ప। శబ్దసార మెఱుగు శక్తిలేదు। ఇది హితవనంగ అది విరోధమగును। కాలమహిమ లోని జాలమిదియె 167
సాగరమ్ము బోలు సంసార జలధిలో। మునిగి తేలుచున్న యునికి జూచి। ఊబి నుంచి లాగి యుపదేశ మొనరించు। జ్ఞానమూర్తి ఎవరు కానరారు 168
లోకులెల్ల బుద్ధిలో దాగు నగ్నిలో। కాలిపోవు చుండె కామతృష్ణ। నేను ప్రేమ నిడగ నిలుచు వాడెవ్వడు। నాకు పిచ్చి యంచు నవ్వువారె 169
ఎవరి కొఱకు నేను ఇంత చింతించెదో। అట్టి విభుడు దొరకడాయె నాకు। తత్త్వ మెరిగి చూడ తానుండె నా వెంట। గుణములంట నట్టి గురుతు దొరకె 170
పాలు ద్రావి విషము ప్రసరించు నురగమ్ము। నీరు తాగి మనిషి క్షీరమిచ్చు। విషము తాను ద్రావి విలయమ్ము తప్పించు। విభుడు ఈశ్వరుండు వింతగాదు 171
నీటి లోతు దలచి నిలుచుంటి తీరాన। జంకు మనిషికెంత శత్రువగును।లోతు నరయ లేక లోకేశుడెటు దక్కు। ఒడ్డు నుండి నేను ఓడిపోతి 172
నిన్ను తెలియనెంచి నీకునై వెదకుచూ। తిరిగి నన్ను నేను తెలుసుకొంటి। బిందు వెప్పుడైన సింధువే యౌనను। సత్య మరయ గల్గి సాధునైతి 173
ఒకటి సర్వమందు నొకటిలో సర్వమ్ము। కలవటంచు బుధులు పలికినారు. నేను జ్ఞాన మందు నిజముగా కలిసితి ।అందు మారులేదు అనువు(సామర్ధ్యం)తప్ప 174
ఎంత చదువు చదివి యెన్ని వర్ణించినా। సంశయంపు శూల చావలేదు। దుఃఖ కారణమ్ము దొరికె నేమోగాని। తొలగుదారి నాకు తెలియలేదు 175
చీమ తండులముల చేరవేయుచునుండ। అచట పప్పుగింజ గోచరించె। 'అన్ని తనకె' యనెడి అతియాశ ఫలమేమి। ఏది యెవని ప్రాప్తమేది హితము 176
సత్యమెప్పుడైన చాల చేదుగ నుండు। కల్ల ఎవరికైన కమ్మనగును। మాయ నిలిచిపోయె మంచి మిగులదాయె। రాముడుండ గలడె రాళ్ళలోన 177
మాట చెప్పు టెంత మధురమై యొప్పును। చేతలందె దాని చేదు తెలియు। గుళిక చేదులోనె గుణము దాగినటుల। కర్మయోగమందు ధర్మముండు 178
నీరు చుక్కలేదు నీ వెంత వెదికినా। పాలనివ్వజూతు పరులకీవు। నిశ్చలమ్ము లేని నీ బుద్ధి వెచ్చించి। పరుల నుద్ధరింప పాడియగునె 179

ఒట్టి మాటలందు ఒనగూడు ఫలమేమి । చేతలందు మేలు చేయగలవు । నిష్ఠగలుగు కర్మ కష్టమ్ము గడతేర్చు । కాపురమ్ము గడచు, కడలి దాటు 180
పదము పాడుకొనుచు పథము మరువకోయి । సాధనమ్ము విడిచి సాగలేవు । చేది యున్న నీరు చేదుగా కనిపించు । చేదు కొనుట నీకు చేతకాదు 181
పలుకు పలుకు గూర్చి పదము లల్లిన గాని - అందు సార మేది పొందలేవు । మోహ సలిల మంత వాహినియై పారు । నీదు అడుగులందు నిలువ లేవు 182
నడచి పోవువాడు తడబడ్డ తప్పేమి ? । తావు కదలలేక దక్కు నేది ? । నీవు కదలకుండ నిడివి లెక్కలు వేయ । పనికి చేటుగాక ఫలితమేమి ? 183

కన్ను మూసినపుడు కలలోన నైననూ । మనసు ధ్యానమందె మసలవలయు ।
చితినిజేరు వరకు చింతబాయని వాని । క్షేమ మరయ గలడు రామవిభుడు 184
వక్త లెక్కడైన శక్తి గలిగియుండు । వినెడి వారు లేరు విశ్వమందు ।
మాటసార మరయ మాధుర్య మబ్బును । వాణి తెలియు విభుని వార్త తెలియు 185
మాట తీరు యొకటి మనసు మర్మమొకటి । మనిషి ద్వంద్వ నీతి మసలుచుండెను ।
రెండు ముఖములున్న పందునా బ్రతుకెల్ల । పరిహసమ్ము గాక పరువు గలదె 186
వినెడివారు లేక వివరించు మాటలు । వాదమగును మాట భేదమగును , వక్త శ్రోత కలసి భక్తితో పలుకగా , స్వాదమగును, అవియె స్వామి వినును 187
సతులు సుతులు పోయె సహజవాసనలందు । ధనము పోయె, మరియు ఘనము పోయె । కామమంతరించి కారుణ్యముప్పొంగ । ఈశుడు, కవిదాసులేదేకమయ్యె 188
తనకు తాను నేది తరుణమై దొరకునో । అదియె తృప్తినిచ్చు నమృత ఘటము । అడిగి పొందినట్టి దదియెట్టిదైననూ । ముందు రక్త సదృశమ్ము రిక్తఫలము 189
అన్ని నీవె యనుట కాధార మివ్వవు । నీవె 'అణు'వ నుటయు నిజము కాదు । అన్ని మాకొసంగి కన్నులం దోచని । నిన్ను తెలియుటెట్లో నేర్పవైతి 190
అనుభవమ్ము తప్ప అన్యమేదైననూ । ప్రభువు జాడ తెలియబరచలేదు । ఉనికి చెప్పనేల ఉత్తవాదములేల । మౌన ముద్రకన్న మంచి లేదు 191
కనులు నిన్ను జూచు గాని చెప్పగలేవు। పొగడగలదు నాల్క పొడయలేదు(చూడలేదు) - చెవులు వినునె గాని చెప్పలేవెన్నడూ । తెలియు నీవటంచు తెలుపుటెట్లు ? 192
వాదమందు దాగి పాషాణముండును । మాటలందు వెతల పాటు గలదు । మౌనముద్ర దాల్చి గానమ్ము సేయుచో । పంకజాక్షుడందు శంకలేదు 193
ఆకసమున దేలి అంబుధి మునిగినా । భువన మండలమున భవనమున్న । లాభమేమి గలదు లాలసత్వము దప్ప । దాసుడెపుడొ రత్నధారుడయ్యె 194
ప్రాణమన్న తీపి పణముపై నాసక్తి । హరిని చేరుటెట్లు ? ఆశగాక ! । గురుడను కడలి దిగి గురుతుగా రాగల్గ । అనువుకాడె రత్నమంద గలడు 195
ఎట్టి చావు కొఱకు యెల్లలోకమ్ములు । అన్ని వేళలందు అడలు కొనునొ । అట్టి చావు నాకు ఆనందపూర్ణమ్ము । కలుగు జేయు నిజము, కలను గూడ 196
మృతుడు తనకు తాను మృత్యువును జయించు । ఇల్లు కాల్చినపుడె యిహము తెగును । వింతయగును గాని విపరీత మదిగాదు । చావు సాధుగమన సాధనమ్ము 197
అతని పొందెననుట అవివేక మగు భ్రాంతి । పొందలేదనుటయు పొల్లు మాట । పొందినదియు లేదు పోగొట్టుకొనలేదు । పుణ్యాదాత్మ నందె పూర్ణుడగును 198
పట్టుకొందు మన్న పట్టుబడు నెవడు ? । విడుతునన్న నెవని విడువగలను. । పట్టు విడుపు మధ్య పరమాత్మను గ్రహించి । కొలుచుచుంటి నాత్మ నిలుపుకొంటి 199

అతిగ బలుకరాదు అతి మౌనమును గాదు। అతిగ ధనము నెవరు నంటరాదు। ఎండ తగదు అతివృష్టియును గాదు। మితము సర్వవిధుల హితవు గాదె 200
హరిని పొందగోరి అనిసేయ గలవాడె- శూరుడగును సత్య వీరుడగును। అతడు ముక్కలైన ఆజి విడువబోడు। ఆత్మ యుద్ధభూమి అలుగు భక్తి 201
బంధనములు బాసి బ్రతుకు ఆశ విడిచి। పోరునట్టి వాడె వీరుడగును। చావు వెఱవ డతడు సమరమ్ము విడువడు। తర్పణమ్ము సేయు తనకు తానె 202
శిరము ధారవోసి శివుని పొందెడివాడు। అమిత భక్తుడగును అమరుడగును। కత్తిరించినపుడె వత్తి వెల్గులు హెచ్చు। ధీరుడైన వాడె చేరు శివుని 203

మనిషి మనిషి కొక్క మతము వేఱై యుండు। మతము లెన్నియైన మార్గమొకటె।
మనసులోని మాట మరుగులేక వచింతు। అనుభవమ్ము బహుళ మాత్మ యొకటి 204
వెతకువానికెపుడు వెఱవు కలుగుచుండు। మదిని క్రుంగదీయు మలికితమ్ము(సందేహం)
దైవమందుకొనెడి ధైర్యమ్ము నీకున్న। అరను విడిచి ముందు అడుగుబెట్టు 205
ఆయుధములు బట్టి అనిసేయు వానిని। శూరుడనుట నాకు చోద్యమగును।
మాయ త్రెంచి విభుని మహిమంబు నెరుగుటే। శూర ధర్మమనెద, శూరుడనెద
పతిని గొల్చు సతికి పైరంగు పనియేమి। కుల్యకేమి తరుగు కుబ్జయైన। కోరి విభుని చేరు కొమ్మకీయిలలోన। కోటి జాణలైన సాటిరారు. 206
పతికి ఉపచరించు అతివయే స్థితిలోను। పరుల దరికి జేర మరులు కొనదు। పస్తులున్న గాని పరిగ ముట్టని యట్టి। సింగమునకు సాటి చెప్పనగును 207
కనులలోకి రమ్ము కమలాక్ష యొకసారి। కంటి పుటములార్పి గప్పి వేతు। పరుల చూడబోను పరల చూడగ నీను। సామి విరహమొకటె సంతసమ్ము 208
స్వాతి చినుకు కొఱకు సాగరమున శుక్తి। తపము సేయు, జలము తాకబోదు। విభుని గొల్చు ప్రణయి విధి విధానమదియె। స్వచ్ఛమగును ప్రేమ సత్యమగును 209
దాహమెంతయైన దరిజేరనీయదు। చాతకమ్ము బావి జలమునెపుడు। నాదుమదికి చేరలేదు యేదైననూ। రామ నామ తీర్థరసము తప్ప 210
చక్కనైన సామి మక్కువ ననుచేర। పరుల మదిని చేర్చ పాడిగాదు। పరువు నెరుగలేని పతితుడనేగాదు। పరమ పురుష నాదు పరువు నిలుపు 211
రంగమెక్కి పడతి రాగమ్ము పాడుచూ। అది ప్రియుని కలసి పాడుకొనును। చేతనమ్ము గలిగి చీకి తెర వీడి। తైలమయ్యె కామ తత్త్వమచట 212
నీదు ధ్యాన సిరులు నిలిచిపోయినపుడు। మల్లుడైన గాని చెల్లబోడు। సాధ్వియగును గాక సౌభాగ్యమబ్బదు। దాత యగును గాక ధనము రాదు 213
కలికి సాధ్వియైన కాంతునే స్మరియించు। కలనుగాని పరుని తలచబోదు। భక్తుడెన్నడైన భగవానునెడబాసి। బ్రతుక గలడె సుపతివ్రతయు వోలె 214
మగని గొల్చు పడతి మరియాద మీరంగ . పరుల ముందు పతిని బలుకనట్లు. విభుని స్నేహమందు వివశమందిన నాడు. నామ జపము లేక నష్టమేమి 215
సర్వరూపు డతని సామీప్య మందక। ఎంత తెలుసుకున్న నేమి ఫలము। ఒక్కడతడు తెలియ నొనరు సర్వస్వమ్ము। అతడు తెలియకున్న అందదేది! 216
కొమ్మసాగియుండె రెమ్మలాందోళించ। ఆకు కదలుచుండె నలరులూగె. అన్ని తెలిసె గాని అరయలేము మూల. మంఘ్రి(వేరు) నెఱుగువాని కడ్డమేమి 217

సింధురంపు రేఖ సింగారమౌ కళ్ళు। సిరులు పంచుచున్న మరులు రేడు। నాదుకనుల నిండి నటియించు చున్నాడు। అన్యమేది నేత్ర మరయలేదు. 218

ఎన్ని జాములైన ఎన్ని ఘడియలైన। ఎవరి కొఱకు నేత్రమెదురు జూచు। ఆది అంత మెఱుగు అతని జూచుటయన్న। కనులకున్న గొప్ప కలిమి గాదె 219

మనసు తేటయైన మగనాలికెన్నడూ। కాలధర్మ భీతి కానరాదు। చేత కుంకుమంబు నూతగా ధరియించి। నిలుచు నారి కెదురు నిలుచు నెవరు? 220

సులువనంగ రాదు సుందర జీవనం। చుట్టు నిప్పు తడికె కట్టియుండు। నాల్గు దిక్కులందు నడయాడు కాలాగ్ని। గడచి ధవుని చేరు పడతి పడతి 221

మగని పడక జేరి మదిని వేరొకరితో। మేలమాడు జాణ లీల పోలె। అంతరమ్మను తెఱ నడ్డముంచెడి సాధు। అంతరాత్మ విభుని యంటబోదు 222

నిన్ను తలచి తలచి నేనెంత వేచినా। చూడలేదు, నీదు జాడలేదు।

నామ జపము నిండి నా మనస్సుండగా। నష్టమేమి నాకు, కష్టమేమి

గురువు నొక్కవైపు గోవిందునొక వైపు। పాదమంటి యొకరి పరిచరింతు!

గురువు చూపు వాడు గోవిందుడే గాన. గురుని పాదమొకటె గురుతు నాకు 224

మన్ను వంటి నన్ను మహనీయుడను జేసి। పుణ్యతేజ మిచ్చి బ్రోచినావు।

చదువులయ్య! నీకు సన్మాన మెటుజేతు। ఆత్మసాక్షి తోడ నంజలింతు 225

కాగితముగ భూమి కలముగా వృక్షమ్ము। సాగరమ్ము 'మషి'గ సరుకు జేసి. ఎంత సొగసులద్ది యేమి వ్రాసిన గాని. గురుని గుణము చెప్ప తరముగాదు 226

విషయవాంఛ విడిచి విశ్వదాత దలచి। అహము తుడిచిప్పి◌ాఅజుని గూర్చి। మదిని ప్రార్థనమ్ము మరువక సేయువా। దెవ్వడేని ధన్యుడిలను జూడ. 227

మైల కడిగి వేసి మనసు తేట పరచి। శుద్ధమైనవెల్ల బుద్ధి నొసగు। ఓజ ప్రాపుజేర నొనగూడు సర్వమ్ము। అఘము వీడి మనసు అద్దమగును 228

చాకి నూలుబట్ట చలువ జేసినయట్లు। గురుడు ఛాత్రునుదికి గుణము చూపు। ధ్యాన మనెడు బండ దైవమ్ము సబ్బుగా। అదను జూచి యొజ్జ పదునుబెట్టు 229

గురుని పోల్చి చూడు కుమ్మరి తానౌను -తట్టి కడవ జేసినట్టు లొజ్జ। దండనమ్ము తోనె దరిజేర్చుకొను ఛాత్రు। బోధనమ్ము బంధ సాధనమ్ము 230

విధుడు(విష్ణువు) కినుక బూని విడిచి పెట్టిన గాని. గురుడు ఎదను జేర్చి గురుతు జెప్పు. దేశికుండు విడువ దిక్కెవ్వరిక నీకు. విడువరాదు విదుని నీడనెపుడు 231

హరిని జేరుకొనగ హరినే శరణుజొచ్చ। తడవుబట్టు అతని దరికి జేర। దైవ దరికి జేర్చు దారి యొజ్జ కెరుక। లిప్త లోన జేర్చు నాప్తుడతడు. 232

గురుడు స్పర్శవేది గుణము గంధపు ధూళి। అతని నీడ నీకు అమృతమయము। ముక్తి యొసగు ఫలితశక్తి గల్గినవాడు। బుధుడు, దివ్య దతని పోలికెవరు? 233

చదివినంత నీకు సాయుజ్య ధర్మాల। ఎఱుక చిక్కబోదు ఎక్కడైన। గురుడు ఎఱుకజేయ గుటి చిక్కు నీలోన। ఎఱుక లేక ముక్తి నెఱుగ బోము 234

మూడు లోకములును ముమ్మారు ఖండముల్। వెతికి చూడు, గురుని జతకు రారు। ప్రభువు మాటకన్న ప్రాజ్ఞు పలుకు మిన్న। చదువుదాత కెవరు సాటిరారు 235

హరియు విడుచునేని గురుని చేరగవచ్చు। హరిని జేరు దారి నతడు చూపు। గురుడు విడుచువాని హరియు చేరగనీడు। శిక్ష నిచ్చు వాడె రక్ష నీకు 236

ఎచట వస్తువుండ నచట వెదుకమేలు। మర్మ మెలిగి నపుడె కర్మ సాగు। ధర్మ మెలిగి బోధ దయచెప్పగల వాని- వెంటనంటి యుండ తంట లేదు 237

వేల్పుబువ్వ(అమృతం) గురుడు విషవల్లి దేహమ్ము। ఛాత్రు(శిష్యుడు) నమృతమయుడు చక్కబెట్టు। దేహమిచ్చియైన దేశికుం జేపట్టు। చీకటింట దివ్వెశిక్షకుండు(గురువు)
కోటి సూర్యకాంతి కోటి చంద్రుల కాంతి । కానరాదు మదిని కాంతి లేక । ఒజ్జ లేక నీవు సజ్జనుండెట్లౌదు !। గురుని విడువ రాదు మరణమైన 239
గురువు లేని చోట అరుణ కిరణుండు । నిలిచియుండుగాక వెలుగు రాదు । సత్య దేశికునికి సరిరాదు దినరాజు । పావనమ్ము గురుని పాద స్పర్శ 240
మూర్ఖుడైన యొజ్జ మూగవానికి సాటి । వేల రూకలిచ్చి విడువ వలయు । అదును పదును లేని అధ్యాపకుండేల । వాగు దాట రాళ్ళు పనికి రావు 241
అన్ని తెలిసిగూడ నర్థమ్ము గనలేడు । అర్థమైన గాని అగవు(పని) లేదు । అంధుడంధు జేర అధ్వ(మార్గం) మెవ్వడు జూపు । దారి జూపు వాడె దర్శకుండు 242

రోమ రోమ మందు రామనామము బల్కు । వలపు నిండి నట్టి వసువు నందు ।
మాపు రేపులందు మరువనట్టి విభుడు । మనల విడిచిపెట్టి మాయమగునె 243
సజ్జనుండు మేఘ సదృశమై వర్షించు । పరహితార్థి యగుచు పరిఢవిల్లు ।
తనదు స్పర్శనిచ్చి తాపమ్ము పోగొట్టు । పరుల సేవలోనే పండిపోవు 244
సింహ మెపుడు గుంపు చేరగా గనరాదు । అందుకు హంస బారు గట్టు టరయబోము ।
రాళ్ళ గుంపులోన రత్నమొక్కటైయుండు । సారవంతుడెవని చేరబోడు 245

చందనమ్ము రాదు సానువులన్నింట । చిక్కదన్నిచోట్ల చినుకుపూస । అట్లే సజ్జనుండు అరుదుగా లభియించు । అరయ గల్గినపుడె నతడు తెలియు 246
సాధువనెడి పేరు సాధించుటే గొప్ప । పొడవు ఖర్జురంపు భూజమద్ది । ఎక్క గల్గువాడె మెక్కగల్గు మధువు । మధువు దొరక నపుడు మరులు లేవు 247
ధనము చూడబోని ధార్మికుండెవ్వడో । చెలువ నంటబోని 'స్థితు' డెవండో । పరగునతని కాలి పాంశువై(మట్టిరేణువు) చరియింతు । సాధుసేవలోనే సకలమబ్బు 248
చెట్లు పండ్లు తినవు, చెలమ తాగదు నీరు । ఇచ్చుటందె తనివి హెచ్చు పొందు । సజ్జనుండు తాను స్వార్థమ్ము విడనాడి । పరుల కిచ్చుటందె మురిసిపోవు 249
చేర వచ్చునట్టి పౌరుల మనసులో । భావ మెట్టిదైన బాధ లేదు । తాను ఆదరించి తన మదిన్ జోటిచ్చి సాకువాడె భువిని సజ్జనుండు 250
రాత్రిజలము(మంచు)కన్న, రజనీకరుని కన్న । చైత్ర పూర్ణిను వెలిఛాయ కన్న । చల్లదనములోన సజ్జనుండే మిన్న । సాధుమాట చలువ సాటిలేదు 251
కులము దలచి గాని, ఫలము వలనగాని । జాతి నెంచిగాని, స్థలముగాని, । వయసు జూచిగాని, వాసినెన్నియుగాని । చూడరాదు 'సుగుణ' జాడనెపుడు 252
విద్యతోటి వెలుగు విజ్ఞాన బలమును । నిత్య ధార్మికతయు, సత్యస్థితియు । ప్రేమ గలుగు బుద్ధి ప్రియమైన వాక్కులు । సాధు నరయ మంచి సాధనములు 253
కోటి కొంచెగాంధ్రు కూడి యున్నను గాని । భేద బుద్ధి రాదు భిక్షువులకు । నాగుబాము లెన్ని నలుమూల చుట్టినా । చలువబాయ బోదు చందనమ్ము 254
సౌమనస్వి చెంత సకటు(దుష్టులు) లెందరు నున్న । నెలవుదాటి పోదు నియతి విడిచి । ఫలములూడి పడిన పర్ణముల్ రాలినా । విడువబోదు తోట విటపమెపుడు 255
మావి తోడు జీడిమావిడి యున్నట్లు । సాధులందు సిద్ధచారులుండు । అమృత భావమునకు అహమునూ తోడుగా । కలసి ఏకరీతి కానుపించు 256

సాధు నెడద శుక్తి, సాగరము రాముండు। బిందుఫలము(ముత్యము) పండుటందు గనుము। రామునెరగబోని రాలుగాయకు చిక్క। కుప్పవోయు రాయి రప్పగాదు 257
అల్పులున్న పెద్ద అంతఃపురము కన్న। సాధువుండు పర్ణశాల మేలు। పనికి రాని తుమ్మవనము పెంచుటకన్న। ఒక్క మంచి తులసి మొక్క మేలు 258
రామభద్రు కంటె రామనామము గొప్ప। ధరణి రామ విభుని దాల్చియుండు। రాముడుండు సతము రామదాసు నెడంద। తీరునరయు మీ కబీరుదాసు 259
స్వామి రూప శోభ సాకార దర్శన। మ్మభిలషించు హితుడ ఆత్రమేల। పరమహంస నీకు ప్రత్యక్ష దైవమ్ము। సాధు సేవలోనె సాక్షి(దైవము) దక్కు 260
తెలిసి మూర్ఖులైన తీర్థంకరుల దారి। చేరబోరు ఎట్టి వారలైన। బలము కలిగి గూడ బలహీనుడౌ వాని। సంస్కరింప నెట్లు సాధ్యమగును 261
పసిడి వంటి వాడు అసలైన సాధువు। విరిగెనెన్ని మార్లు తిరిగి అతుకు। మట్టికుండబోలు మాయగానితో మైత్రి। తిరిగి అతకబోదు విరిగెనేని 262

స్మరణ దుఃఖ మందు సాధారణమ్మౌను। సుఖమునందు విభుని చూడడెవడు।
సంతసమున గూడ సర్వేశు దలచిన। చింత దరికి రాదు చితిని కూడ
చదివినంతలోనె సాధించునది లేదు। కోమలమగు నెడద కూడవలయు।
నీట నానినంత ఈటె మెత్తనగునె। ఎడద లలితమైన బెడద లేదు 263
స్నేహమెంత పంచి సేవించినా మూర్ఖ। మనసు గతిని నీవు మార్చలేవు।
చవిటి నేల దున్ని సాగు చేయుట యన్న। సాధ్యమగునె ఎట్టి సైరికునకు ? 264
భవము నందు చిక్కి ప్రాకులాడెడు వాడు। సాధుమైత్రి వలన చక్కబడును। శ్రీసుగంధమంటి శీతవృక్షము(వేపచెట్టు) గూడ। పరిమళమ్ము గూర్చి వాసికెక్కు 265
కొంగబుద్ధి గలిగి దొంగ జపము చేయు। హారితుండు(మోసగాడు) బకము ననుసరించు। కాలపాశ మందు కలసి పోయెడి కొంగ। మత్స్య మందలేదు, సత్యమిదియె. 266
కావి రంగు వలువ, గళము పూసల పేర్లు। చేత తిరుగుమాల, చిరత చెక్క,। మోర తిలకమద్ది ఊరేగు నటునికి। మనసునున్న నంటు మకిల మాన్పగలవె 267
తలలు నునుపు జేసి తడిబట్ట జుట్టిన। చిత్తమదుపు జేయ చేతనగునె ?। భక్తి కుదరబోని రిక్త వేషపు జాణ। తనకు తాను మోస మనుభవించు 268
మరల మరల జుట్టు మంగలికిచ్చిన। అజుడు చిక్కుననుట కర్థమేమి?। గొఱ్ఱె నెన్నిసార్లు గొరిగెద రున్నికై। శ్వేతదీవి దెసకు చేరగలడె 269
పుట్టమీద కొట్టి పొందు లాభమ్మేమి। పుట్ట నిన్ను కాటు వెట్టబోదు। సర్ప మదుపు జేసి చాటించు నీ శక్తి। ఫలితమింతయైన ప్రాప్తముండు 270
సజ్జనుడు ధరించు సత్యవిభూతిలో। దుర్జనుండు పొరలి దూరుచుండు। మనిషిగక్కు కూడు మరులుతో దినుకుక్క। లోలుపత్వ మింతె ! లోకమింతె 271
పాదరసము తాకి పరుసమ్ము తెల్లనౌ। తెల్లపసిడి విలువ తేలిపోవు। దురితమౌను బ్రతుకు దుర్మార్గ చెలిమితో। శిలల పడవ దరికి చేరగలదె ? 272
గాలిదిండి(పాము) చుట్టె గంధపు వృక్షాన్ని। చూడ రెవరు దాన్ని నీడకైన। గరళమంటి యున్న నరుని దరికిరారు। మొదట నాత్మ శుద్ధి ముదము నీకు 273
విషము విత్తి అందు 'వేల్పుబువ్వ'(అమృతము)ను బోయ। లాభమేమి దాని లాలసేమి(కోరిక) మదిని భావమేది మాటుగా నుండునో। అట్టి గుణము విడిచిపెట్టలేరు 274
గుణములేని వటువు, గురువేమి చేయును। ప్రాజ్ఞుడుండి కూడ ఫలము లేదు। వెదురునందు చేరి సుధలు పలుకుగాని। శరము నాప గలదే శబ్దశక్తి 275

తవుదు తిన్నగాని తాపసి స్నేహాన। సుగతి దొరకు నామ సుధలు దొరకు। 'పలవ' వెంటజేరి పాయసమును తిన్న। బ్రతుకు రిత్తవోయి భంగపడును 276

సుజనమైత్రి నిత్య సుమతైల సార్థక। చెలిమివోలె ఎపుదు నిలిచియుండు। అత్తరు వణిజుండు అత్తరివ్వక యున్న। తావి నిన్ను జేర్చు తమకమందు. 277

'మథుర' మంచిదౌను, మంచిదే 'ద్వారక',- 'పూరి' ధామమైన పుణ్య నెలవై। సాధు సంగమమ్ము సమకూరినప్పుడే। ఎట్టి క్షేత్రమైన గట్టు జేర్చు 278

సాధు చయముజేరి సత్సంగములు చేయు। దినమె మంచి దినము తిరుగులేదు। భక్తి లేని రోజు పక్షి వీడిన గూడు। ఫలము లేదు ఇహము పరము గాదు 279

'కోట కాల్వ'(అగడ్త) నీరు తేటగా నున్ననూ। తాకనెవ్వడైన తడయుచుండు। గంగ జేరి ఎంత కలచిన జలమైన। శిరము దాల్చు నదియె శివుని మహిమ 280

సత్య భాషణమ్ము నిత్యమంచెరిగియూ। దుర్జనుండు తానె దూరమగును। అట్టివాని పొందు ఎట్టిచో సరిగాదు। కలనుగాని వాని దలచరాదు 281

మాల తిప్పుకొనుచు మన్వంతరము దాటె- మనసు తిరుగు దారి మారలేదు।

చేతి పూస తిప్పి చేసేది లేదోయి। అంతరంగ భక్తి ఆత్మశక్తి 282

మడుగు'(వస్త్రము) మసిని దాకి మలిన మంటిన గాని। పొడవు సబ్బు బ్టెటి కడగవచ్చు।

కష్టపడిన గాని ఇష్టపడిన గాని। కాకి హంస యగుట గాంచగలమె 283

చెడ్డ సంగమెపుదు చితిజేర్చు శకటమ్ము। కదళి యంటియున్న కంటకమ్ము।

కదలునేదియైన కదళికే మోసమ్ము। పాత్రమెఱుగు చెలిమి భద్రమమ్మ 284

రేగుచెట్టు తనను బాగ చుట్టుకొనగ। ముప్పుగాంచదరి ముందుగానె। చేయి దాటి పోవ చేయగల్గిన దేమి। తులువ పొత్తు మొదటె తుంచవలెను 285

ప్రభువు శ్రీయుతుండు పరిచారికుడ నేను। విభుని దారినెపుదు విడువబోను। అతడు గొట్టుగాక ఆ దారి వదలను। చిత్తమప్పుడైన మెత్తబడదె?। 286

దాసుడగుదు గాని దాస్య భావము రాదు। భావమందు నెనరు(ప్రేమ) బారుచుండు। నీరు లేక దప్పి నీకెట్లు దీరును. దాస్య మనగ ప్రేమ తావి గాదె ! 287

భుక్తి కోరబోను ముక్తియూ నడుగను। భక్తి దానమిమ్ము భాగ్యశాలి। ఏమి లేని నాకు నెంతయో నున్నట్లు। తలచుకొందు నిన్నునీదు తలపులందు 288

కనులు మూయలేడు అనురక్తుడెన్నడూ। విరహ యోగ మందు వేగుచుండు। నీటి బాసి చేప నిలుచునా క్షణమైన। ప్రేమయున్న చోట పేర్మి కలదు 289

ఎదను స్వామియుండ ఎరుగనట్లుండుట. సాధ్యమగునె నీకు సాధకుండ. ఎచట దాచుకున్న ఎలమి(వెలుగు) నాపగలేవు. అణువు అణువు నిండి అజుడు వెలుగు 290

కట్టె ఎవనిదైన కాబోదు శూన్యంబు। ప్రభువు తనకు తాను ప్రకటమవడు। అన్ని యెదలలోన అణురూపమున నుండు। వెడలు చోట తెలియు వేల్పు సిరులు 291

ఫాలమందు తత్త్వ కాలమ్ము దీర్చును। కర్ణములకు స్మృతులు 'కమ్మ'లగును। చేత' కంఠమందు 'చేరు'(మాల)గా ధరియించి। చావునంటి తిరుగు సాధువెపుడు 292

మనసు మాల వేసి తనువు మేఖల జుట్ట। భయ విభూతి దిద్దు ఫాలమందు। రూపుగట్టి విభుని రూపమ్ము దర్శించు। వెలుగును అవధూత విశ్వమందు 293

తనువు యోగియైన తరియింప సాధ్యమా। మనసు యోగమందు మసల వలయు। ప్రథిత యత్నమందు పరమాత్మ దరిజేరు। యోగసిద్ధి దివ్యయోగ మిచ్చు 294

నీదు జుట్టుపట్టి నియతించు(కట్టడి చేయు)చున్నాడు। కాలు డహరహమ్ము! కల్లగాదు। ఎందు దాగియున్న నెచట తిరుగుచున్న। కాలగతికి మార్పు గలుగబోదు 295
సుఖము గాని బ్రతుకు సుఖమని తలపోసి। మనసు మురియుచుండు మాయ లోన। కాలమెప్పడైన కాలుని సొంతమ్ము। నిలువ చోటు లేదు నేల మీద 296
నీటిబుడగ వంటి నీదేహ మోహాన। కొట్టుకొనుచు నీవు కులకనేల। చూచుచుండగానె చూపుకందదు మేను। వేగుచుక్క వోలె వెలిసిపోవు 297
రాత్రులన్ని నిదుర పాత్రమై సరిపోవు। దినము తిండి కొఱకె తిరుగులాడు। తరళ(రత్నము) తుల్యమైన తగుజన్మ మంతయూ। గుడ్డి గవ్వకైన కూడదాయె 298
ఎపుడు బుద్ధి బుట్టు నపుడె తలచుకొమ్ము। విభుని స్మరణ సేయ వేళ ఏల ?। రేపు తలతునంచు ఆపబోకుము సుమ్ము। కాలమెపుడు నిన్నె కాచియుండు 299
ఐదు 'నౌబతు'(షెహనాయ్) లును ఐక్యమై పాడెనో। ముప్పదారు రవములప్పగిలెనో। అట్టి మందిరమ్ము నిట్టనిల్వున గూలె। కాకి కొల్వుదీరె 'కా' వటంచు 300
కోడె వయసు జూచి గొప్ప నీవనుకోకు। మేడ మిద్దె చూచి మిడిసి పడకు। చెలువు మీర విరులు నిలుచునా కడదాక। గడ్డ కలియు, మీద గడ్డి మొలచు 301

ఆకలియను కుక్క అకటవికట చేసి। భజన సాగనీదు సుజన మిత్ర!।
ముక్క దాని కొకటి ముందుగా పడవేసి। భక్తి భజన చేయ ముక్తి గలదు గలుగు 302
తనువు నిలువనపుడు తగులాట మేలోయి। నీకు సాధ్యమగునె నిలువరింప !।
కోట్లు గలిగి యున్న కొండలెక్కగలేవు। చిల్లిగవ్వ కూడ చేరిరాదు 303
తరచి చూచినంత తనువొక సత్రమ్ము। మరులు గొలుపుచుండు మనసు కాపు।
కోర్కె మనసు నందు కొసలుదేరును గాని। కడకు మిగలడెవడు కాలమహిమ 304
నాదలోలుడైన నా స్వామి తెలియగా। విషదమైన భవము విడిచినాడ।మనసు కట్టి వేసి మాధవు జపియించి।కడకు సఫలమైన కాంతి నైతి 305
సుఖము లేదు రేయి సుఖములేదు పగలు। ఎండ, నీడ, సుఖము నివ్వబోవు। నామ మహిమ వీడు నయగారి కెన్నడూ। ఇలను సుఖము లేదు, కలను లేదు 306
నిన్ను నీవు తెలిసి నినుగాచుకొన నీవు। నిదుర మేలుకొమ్ము నిముషమైన।ఘడియ ఘడియకెట్లు గడచునో బ్రతుకులు। అరయ సాధ్యమగునె నరునకెపుడు 307
తోట నాశ్రయించి తేటి వాసము సేయు। మధుర జీవ యాత్ర మధువు గ్రోలు। తోట నాశ విడిచి తేటి ఎగిరిపోయె। వాటి(ఇల్లు) చిన్నవోయె వాసిబోయె 308
భయము లేక ఎదకు భావమ్ము గలుగదు। భయము ప్రేమ భావ స్పర్శవేది। భీతి ఎదను వీడ రీతి రసము చచ్చు। భయము విడకు భక్తి భాగ్యశాలి 309
అనుసరించుగాని ఆలోచనము లేదు। గుంపులెక్కడున్న గొఱ్ఱెదాటె। మున్ను నొకటి దూక నన్నియూ దూకును। ధరణి మార్గమంతే ! తలపులంతే ! 310
అడుగులోనే పెద్ద మడుగు డాటెడి వాడు। కొండలన్ని పిండి గొట్టు వాడు। ధరణి నడుగుజేసి దానమడుగు వాడు। కాలగతిని దాటి నిలువగలడె! 311
తోటమాలి పూలు తుంచుట గనినంత। మొగ్గ లడరుచుండె నిగ్గు చెదర। విచ్చియున్న పూవు విలపించె నేటికై। కోరకమ్ము 'రేపు' కొఱకు నేడ్చె 312
కాలుచున్నవాడు, కాల్చువాడును చచ్చు। ఏడ్చువాడు చచ్చు, ఎవడు నిలుచు। ఎవరికేమి జెప్పి ఏమని మొరపెట్ట। ఫలితమేమి ? దాని ప్రాప్తమేమి? 313
పాశమున్న చోట పరితోష(సంతోషము)ముండదు। సుఖము కోర నెందు చోటు లేదు। పవలు రేయి శ్వాస ప్రస్థాన భేరులు(గుండె చప్పుళ్లు) మ్రోగుచుండె భద్రమోయి సఖుడ!

డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు

తంత్రి తెగిన నాడు జంత్రమేమి పలుకు - వాడిపోవు విరికి వాసనేల ! వంతు వచ్చునాడు తంతు తప్పదులెమ్ము కంటినీటి క్రతువు ! మంటతీర్పు ! 315
ముల్లు గ్రుచ్చి నిన్ను రొల్లుబెట్టెడు వాని । అలరులిచ్చి మిగులనాదరించు । పూవు బదులు విభుడు పూవునే అందించు । ముల్లు నాటు వాడు ముల్లు పొందు 316
బలము లేని వాని బాధింపనొల్లకు। అతనియూర్పు(నిట్టూర్పు) మిగుల అదటు(బలమైనది)సుమ్ము!
భ్రస్తి(కొలిమితిత్తి) లోహములను భస్మమ్ము సేయగా। ప్రాణి ఉసురు వ్యర్ధ భావమగునె? 317
మాటలందు గర్వ మాత్సర్యములు లేక । మనెడు వాడు బుద్ధిమంతుడగును । మాట చల్లనైన మహిని వైరి ఎవరు?। పొగరు విడిచి భువిని పొందు సుఖము 318
జ్ఞాన హస్తి మీద ధ్యాన సమాధినే । పరుపు జేసి దాన్ని పరచుకొంటి । కుక్క వంటి లోకులెక్కుడై మొఱిగినా । తరుగురాదు తపము కరిగిపోదు 319
కడుపుకెట్టి తిండి కడుకోర్కె తిందువో । మనసు అట్టి దారి మసలుచుండు । నోటికెట్టి రసము పాటుగా గుడుతువో । నాలుకట్టి పొత్తు నడుచుచుండు 320
సాటివాని తిరియ చావుతో సమమౌను । పెట్టువాడె ఎపుడు పెనుపుకాడు । ముష్టి బ్రతుకు కన్న మృతి చెందుటే మేలు । గురుని మాటలివియె మరువబోకు 321

కళ్ళు మరగి కరిగి కాల్వగట్టిన గాని । చెలుని చేరు దారి తెలియలేదు ।
వానకోయిలగుచు వలపు పాటలు గట్టి । ప్రియుని ఆశతోడ పిలుచు చుంటి 322
అఘము(పాపము) విడిచిపెట్టి అనువైన బుద్ధితో । తేటతెల్లనైన బాట నడువు ।
కాకి నడక విడిచి కలహంస గమనమ్ము । నేర్చుకొనుము బ్రతుకు మార్చుకొనుము 323
తీయనైన మాట తీర్చు నెదుటి బాధ । పరుష వాక్కులెపుడు శర సమమ్ము ।
మాట తెలిసినపుడె మాధవుండు తెలియు । పలకరింపులోనె ఫలితముండు 324
చదివి చదివి గుండె చట్టుబారెను గాని । కదలలేదు హృదయ కమలమింత । రాసి రాసి కటిక రాళ్ళు మిగిలెగాని । ప్రేమ అంటలేదు పేరుకైన 325
తప్పు చేయనేల తాపమ్ముబడనేల ?। పనిని బట్టి గలుగు ఫలితమెపుడు । ముళ్ళ చెట్లు నాటి పళ్ళు కోరగనేల । సర్వ విదితమైన సత్యమిదియే 328
చోఽఅచిత్తుడొకడు జాఽఅచిత్తుడొకడు । తీర్ధమాడబోయె దివ్యనదికి । జలక మాడినంత మలినమ్ము తొలగునా । పాపభారము పోదు, పంది పెరుగు 327
మైల మైల యంచు జలకంబులాడిన । మనసులోని మైల మాన్పగలవె । ఎల్లవేళ చేప ఏటిలో నుండదా । కంపు బాపగలమె కడిగి కడిగి 328
విద్యలెన్ని నేర్చి విద్వాంసుడైననూ। సంశయములు తొలగ సాధ్యమగునె। అరులు(నమ్మకము) గలుగునాడు అనుమానమే రాదు। భావప్రేమ గలుగ ప్రాజ్ఞుడగును 329
చదువులెన్ని చదివి సంభూతు(జ్ఞానవంతులు)లగు గాక। సంశయములు బోవ జాలవెపుడు। శంక పెరిగి నీకు శరజాలమైపోయి। అలఘు దుఃఖహేతువగును తుదకు 330
దివిటి బట్టువాడు తిమిరాన నుండును । కానుపింప జేయు, కానరాదు । పరమహంస కూడ ప్రతిమానుడే సుమా !। పరమపథము జూపి మరుగునుండు 331
కాయమంత నిండె హేయమౌ గర్వమ్ము । అహము విడువవేని హరియు లేదు । ప్రాణులందు వైర భావమ్ము విడనాడు సాధు । మతము నున్న సారమిదియె 332

బడుగు జీవికైన బంధమ్ములెన్నియో । కలిగియుండుటదియె కాలమహిమ । బంధనములు బాప భగవానునికి గాక । సాధ్యమగునె ఎట్టి 'సాక్షి'(చెప్పువాడు) కైన 333

పాపతాపములకు రూపమ్ము నీవైన । బాధపడకు ఆత్మశోధకుండ । కోటి కర్మలున్న గోటితో తొలగును । రామనామ మంత్ర రక్షయున్న 334

కామి ప్రమిదలోని కాలుచుండిన వత్తి । తైలమింకి పోవ తాను కాలు । సాధుజనుడు రత్న సాదృశ్యమైయుండు । ఎల్లవేళ వెలుగు పల్లవించు 335

విషయ సుఖములంటి విలువైన బ్రతుకును । కాలదన్నుకొనుట కామితంతు । చేతులార మణిని చేజార్చుకున్నాక । జనన ఫలము పోయె జన్మపోయె 336

అంశుడు(సూర్యుడు)న్న చోట అంధకారము లేదు । రాత్రియైన చోట రవియు లేదు । కామమున్న చోట నామమ్ము నిలువదు । నామమున్న చోట కామ ముడుగు 337

దాయలారుగురు(ఆరు కోర్కెలు)ను దాపులోనుండగా। పండితుండ యినను పనికి రాడు।

చదువు రాదు గాక శత్రువు(అరిషడ్వర్గాలు) ల్లేకున్న। నతనితోడు మనకు అభయమగును 338

కామమనగ నేమి? కామరూపమ్మేమి? । కామ శబ్ద మార్గ గమ్యమేమి? । మనసు నందు బుట్టి మరుల భ్రమలు జుట్టి । మనిషినే దహించు మాయ సుమ్ము 339

క్రోధమంటి వెంట కోటి చెడుగులుండు । అహము నంటి క్రోధ మమరి యుండు । మదిని అహము చేరు మార్గముండిన చాలు । 'మంచి' క్రోధమందు మాడిపోవు 340

దర్శనమ్ము నిమ్ము దరికి జేర్చుకొనుము । కాని యడల మృత్యు కౌగిలిమ్ము ।

జాగరూకుడగుచు జాము గడపలేను । ఓపలేను దేవ తాపమింక 341

కుటిల మాటలందు క్రోధాగ్ని యుండును । పలుకు వాడే ముందు భస్మమగును ।

సాధువచనమందు సకల సుధలు పండు- శ్రమను మరువ జేసి సౌఖ్యమిచ్చు 342

పెరకలేని ముల్లు పెనుకంటకపు 'మాట'। గుచ్చుకున్న ఎదను కొటికివేయు।

అంకుశమ్ము వంటి అదటు(కరకు) మాట వినక। చెవులు మూసుకొనుట చివరి మందు 343

మధురమైన మాట మందుతో సమమౌను- మనసు నంటు బాధ మాన్పగలదు- కంటుమాట లెపుడు కంటకమ్మై గ్రుచ్చు- ఒడలు కుళ్ళబొడిచి యుల్లసిల్లు 344

లోభివాని మనసు లాభ సంప్రీతిచే । విషయ వాసనలకు వీడు(నివాసము) గాదె! । ఆయమున్నచోట అజుడెట్లు నివసించు -భక్తి-ధనము కలిసి బ్రతుకగలవె 345

తృష్ణయున్ననాడు తృప్తియుండగబోదు । తృప్తిలేని బ్రతుకు తృణ సమమ్ము । ''ఇచ్ఛ'' జోలికేగి యిరుకున పడబోకు । కలుష భారమెంతొ తలకు జేరు ! 346

భక్తియున్న చోట బంగార ముండదు । సొమ్ములున్న భక్తి యిమ్ముగాదు । మావి గప్పినట్లు మాయ లోభము క్రమ్ము । విషయ సుఖము దాని వెంట వచ్చు 347

లోభి వానికున్న అభిమాన మంతయు । దాన మడుగునాడె దాటిపోవు । మరచిపోవు చెలిమి, మరియాద నశియించు । నిక్కువమ్ము లోభి కుక్క సాటి 348

జగతి నిండియుండు జాలమై మోహమ్ము । దానినెవ్వరేని దాటలేరు । తత్త్వ మరయు సాధు తరలి వచ్చినపుడె । మోహ పాశముడుగు దేహమందు 349

మోహమనెడి మాయదేహమ్మునం జిక్కి । జగములాడుచుండె జాణలట్లు! । సుగతి నిచ్చి మనుపు జగదీశ్వరుని బాసి- మళ్ళి గర్భమందు త్రుళ్ళబోకు 350

సారముండు వరకు సంసార ముండును । దేహముండు దనుక మోహ మలరు -మూడు వేళలందు మూడులోకమ్ములూ । మోహమందు చిక్కి మునిగితేలు 351

గొప్ప గొప్ప బుధులు, గొప్ప వేదవిదులు । మోహజలధిలోన మునిగినారు । ధ్యానమనెడి చిన్న మీనము మాత్రమే । ఏటి కెదురు ఈది దాటగలదు 352

ఎవని గూర్చి మునులు ఇంత శ్రమింతురో । అవనికంత దిక్కు అతని చూడ్కు । ఎవని గూర్చి శ్రుతులు ఇంతగా జెప్పెనో । అట్టి విభుని చేయినందుకొనుము 353

మూడు దశలు గడచి ముగ్గుబుట్టగ మారి। కల్రఅనూత గొన్న వెట్టివాడ। పిల్లి(మరణం) పొంచియుండె పేరాశ పడనేల? నిన్నె అంటియుండు నీడ దండి(మరణం) 354

అదిరిపడుచు కుక్క అద్దాల గుహలోకి। పరుగు పరుగుతోడ నరిగినపుడు। తనదు బింబతతిని దాయలంచు భ్రమించి । మొఱిగి మొఱిగి చచ్చె ! మోహమదియె 355

మాయ తొలగుగాని మానమ్ము(అభిమానము) తొలగదు। మానమంటి పెద్ద మాయచేటు । మాయచేతబడిన మహనీయులైననూ। జారిపోక నిలువలేరు సుమ్మి 356

మానమిదిగో కుక్క; మరియాద తెలియదు। ముద్దు చేసి చూడు మూతి నాకు । వైరమూనుగాక చేరి యొడలునాకు । ఎట్టి గతిని విడిచిపెట్టబోదు 357

కాస్త నీడలేదు కాయలందగరావు । ఖర్జురంపు చెట్టు కలుగనేమి?-పుట్టి పెరుగుటొకటి కట్టబోదు సుగతి । అహము విడిచి ప్రభువు నరయ వలయు 358

అహము గలిగెనేని ఆపద వెన్నంటు । సంశయమ్ము పైన సంకటమ్ము । శంకలేక సతము పంకజాక్షుని గొల్వ । నాల్గు రోగములును నయము గావె! 359

మాయ తొలగినంత మాత్రాన నేమగును। అహము విడిచి పెట్ట నలవిగాదు। అహము విడక ఋషులు సహనమ్ము కోల్పోయి। స్థితిని బాయ లేదె మతిని దప్పి 360

పంజరమ్ము దక్కి పలలమ్ము(ఆహారము) చెయిజారె। కాకులెదురు జూచె కరుణ లేదు।

ప్రభువు వచ్చునెపుడు భాగ్యమెపుడు పండు?- అంతరాత్మ బాధ నరయు నెవరు? 361

ఎదుట ప్రేమ జూపి యెంతయో మురిపించు। వెనుక గొయ్యి తీసి వేడ్క జూచు।

కపటి మాటలోని కౌటిల్యమెంతయో। ఎఱిగి మసలు వాడె యోగ్యుడగును 362

ఆశ చంపుకొనక ఆసనమ్మెక్కినా । మార్గమేల దొరకు మాయలోన । గాండ్లవారి ఎద్దు గాటనే తిరుగంగ । ఇల్లు దూరమౌట ఎరుగలేదా ! 363

సాధువైన నేమి బోధకుండగునేమి ! । ఆశవిడని వాడు దాసుడగును । ఆశ మొదట నీకు అవసరమ్మనిపించు। పిదప నిన్నెబట్టి పిప్పిజేయు 364

మూటగట్టు వాడు కోటనెత్తుకు పోడు । ముల్లె పనికిరాదు ముందు గతికి । 'భావి'కుపకరించు భాగ్యమ్ము కూర్చుకో । భక్తి భాగ్యశాలి శక్తిచూడు 365

ఆశ బూచివోలె అసువులు కబళించు । తీరుకొలది కోర్కె తీవసాగు । తృష్ణ చావనపుడు తృప్తిలేని బ్రతుకు । దుఃఖమయము మిగుల దురితపథము 366

సాధువెక్కడైన జాగరూకత నుండు । నిదురలోన ధ్యాననియత నుండు । జీవమాగి పోవ చేయగల్గునదేమి । చలనమున్న నాడె చక్కబడుము 367

నిద్ర మరణమునకు నిజమైన రూపమ్ము । లెమ్ము వేగ మేలుకొమ్ము సఖుడ ! । నిదుర వదలిపెట్టి నీలరూపుని బట్టు । చేయిబట్టి నిన్ను చేర్చు గట్టు 368

నిన్ను పొరుగువాడు నిందజేయగ నెంచ । అతని ఎదను జేర్చి యాదరించు । నీరు సబ్బు లేక నిర్మలత్వము రాదు । ఔషదమ్మె నీకు అతని మాట 369

గడ్డిపోచ కూడ కాదోయి హీనమ్ము । తీసి వేయబోకు తీరుజూచి । ఎగిరి కంటబడిన యేమౌను నీకళ్ళు । తరచి చూడనిదియె తత్త్వమోయి 370

పరుల దోషమరసి పరిహసింపకు మీవు- తలచుకొనుము నీదు తప్పులన్ని- తప్పు తెలుసుకొనుచు దారి వెతుకువాడు। బుద్ధుడగును, జ్ఞాన సిద్ధు డగును. 371

మాయ, ఛాయ ఒక్క మార్గమై చరియించు । పరుగులెత్త వెంట తరుముకొనును - తిరిగి ఎదుట నిలువ దరిదాపు కైననూ - తొంగి చూడబోవు నంగివోలె 372
'మాయ' చెట్టు వోలె మదిలోన వ్యాపించు । కొమ్మరెమ్మ పెరిగి కొసలు దేరు । నమ్మి దాచుకొన్న నరకమ్ము ప్రాప్తించు - నరికి వేయ విభుని దరి లభించు 373
'మాయ'లోన మనిషి మానవత్వము మరచి. కూడబెట్టుకొనును కోట్లు కోట్లు. ఎంత కూడుకున్న సుంత రాదులె వెంట. కరిగిపోవు క్షణము కలదు నిజము 374
ఎట్టి జ్ఞానినైన పట్టి విడదు మాయ । మునులు జడులనైన మోసపుచ్చు । ఎదను గుచ్చి గుచ్చి వేధించు నెప్పుడూ । మాయ బాయు వాడె మర్మమెరుగు. 375
లోకమంత గప్పె లోలాక్షి మోహమ్ము । కలికి వెంటనంటి కాంచనమ్ము । పత్తిబడెను నిప్పు ఫలితమేమగునోయి । తప్పుకొనుము మాయ దారి నుంచి 376
రామునెరిగి నేను రామనై పోవంగ । మరులుగొంటి మాయ నెఱుగలేక । హరికి నాకు నడుమ అడ్డమై నిలిచిన । మాయ తుంచి విభుని డాయగలనె 377
జ్ఞానమనెడు పెద్ద గాలి వీచిన చోట । భ్రాంతి వల్ల కలుగు భయము వీడె । నామమందు నాకు ప్రేమ కల్గిన దపుడు । మాయ తెఱలు రూపుమాసి పోయె 378
తినుట కెవ్వడేని తియ్యదనము కోరు । వేము తినుట కెవడు వేడ్కపడడు । విభుడు రోగమెరిగి వేపపూవిచ్చెను । చేదు స్వీకరించు చేటుదప్పు! 379
మాయ పెనుకుటజము మమత దాని ఫలము. మూడు గుణము లందు మూలదాగె. విషయ సంతసములు విటప శాఖలగును. మెయి తపించుగాక, మేర లేదు 380
'మాయ' దివ్వెవోలె మరులు కల్పించును । నరుడు పురుగు వోలె తిరుగుచుండు దీప ముంగ న్యాయ దిశలోన పయనించి । కడకు దివ్వెలోనె కాలిపోవు 381

చెట్టు పుట్ట వెదకి చేలన్ని కలయాడి । అడవిపండ్లు నంజి ఆకుమెసవి ।
తరలి వచ్చి రామ దర్శనమ్మను భిక్ష । మరల కోరుచుంటి మరులు బోక 382
ఆటవెలది నీడ అగుపించినంతనే । అంధుడగును విటుడు ఆశ చేత ।
ఎల్లవేళలందు ఎలనాగ తోడైన । చెప్పగలమె వాని చింతలెన్నొ । 383
పదునుగలుగు కత్తి పరనారి మోహమ్ము । కూకటేళ్ల తోడ కూల్చివేయు ।
రామసతిని గోరి రాక్షసేశ్వరు డని । వాలిపోయినట్టి వైనమిదియె 384
పాము, తేలు కాటు పదునైన విషమును । మంత్రశక్తి వలన మాన్పవచ్చు । వికటనారి పట్టు విరువ శక్యముగాదు । గుండె కొఱికి కొఱికి గూడుకట్టు 385
కావు సుందరములు కామిని అందాలు । అవి వియోగ వెతల కానవాళ్లు । అంటుకత్తె పొందు అంతమ్మునకు నాంది । సర్పకాటు కన్న సంకటమ్ము 386
అష్టవిధ మదముల నరికట్ట గలవారు । కానరారు నాదు కంటి కెచట । మదము గెలచినపుడు మధువైరి దరిదక్కు । ప్రల్లదనపు ఫలము కల్లగాదె 387
నామ మత్తునందు నడచు వారెప్పుడూ । విభుని నామ స్మరణ విడువలేరు । విడని భజన కన్న విలువైన సంపద । నరుని జన్మకెపుడు దొరకబోదు 388
శీలమున్న చాలు తులలేని మరియాద । శీలమున్న వాని కాలమరయు । ఓజలేని నాడు భూజాని యయ్యునూ । నుడికి విలువ లేదు పొడుగు(కీర్తి) రాదు 389
శీలమున్నవాడు సిరులున్న వాడౌను । అన్ని రత్నములకు నతడె నెలవు । ఒక్క శీలమున్న వొదుగు సంపదలన్ని । శీలయుతుని సాటి సిరియె లేదు 390
జ్ఞానులుందు రిలను జడధారులుందురు । ధ్యాన సిద్ధులుందు దాతలుండు । శూరులందురుర్వి వీరుల తరుగేల । అకట! శీలవంతు నరయ గలమె ? 391

కడలి వోలె గుణము కడులోతుగా నుండు । శీల మరయు సాక్షి చిక్కలేదు । శీలము గలవాడు శివునితో తుల్యుండు । శీలమొకటె గొప్ప చిత్తవృత్తి 392
తాల్మిలేని వాడు తాపసి యగు గాక । ఫలము గలుగబోదు బాధ తప్ప । భృగువు తన్నినంత పృధివీశ్వరునకేమి? । ఓర్పు గలుగు వాడె నేర్పుకాడు. 393
దయ కలిగిన చోట ధర్మమ్ము నిలుచును । ఎచట లోభమున్న నచట యఘము. క్రోధమున్న చోట కోరి మృత్యువు నిల్చు. సహనమున్న చోటు శౌరి నెలవు 394
ఖలుని మాటలెన్న ఖడ్గ తుల్యమ్ములు । హితవు కోలువాని హింసపెట్టు । అశనిపాత(పిడుగు) మొదవ అంబుధికే మౌను. ఓర్మి సాటిలేదు, మర్మమిదియె. 395
ధరణి యోర్చుకొనును త్రవ్వినా, నాటినా । విటపి యోర్చుకొనుచు విరిచివేయ । తప్పులెన్ని యున్న దైవమార్చుకొనును । తలచ మనిషి కెందు తాల్మిలేదు 396
ఆమని తిరియంగ ఆకులు త్యజియించె। తరువు! కాలగతిని తలచుకొనుచు। పల్లవములు గలిగి ఫలితమ్ము తా పొందె। ఈవి ఎక్కడైన ఈటుబోదు. (వ్యర్థము కాదు) 397
ఇంట పెరుగు ధనము ఇంటికే మోసమ్ము। పడవలోని నీరు పడవ ముంచు। ముంచుదాని గూర్చి మురిపెమ్ము బడనేల। పేద సాద కింత పెట్టరాదె ? 398
కులము గొప్పదంచు కులుకంగ నదియేల। ఆత్మ గొప్పతనము నరయు మోయు। కన్నతల్లి విడువ కర్ణుని కులమేది?। కులము గొప్పకాదు ! గుణము గొప్ప! 399
ఎపుడు బుద్ధి బుట్ట నపుడె దానము చేయి । మరల బుద్ధి ఎట్లు మారగలదో । తనువు దాల్చినంత తనివార దానమ్ము । చేయ గలుగువాడె శ్రేష్ఠుడోయి. 400
మంచిలోన మంచి పంచి యిచ్చినవాడు । రొట్టె ముక్క తుంచి పెట్టువాడు। తరుగు లేని శోభ తరియించ గలుగురా । ధర్మమిదియె నీకు దారి యిదియె 401

దర్పణమ్ము నందు దర్శించు అతివను। పొందగల్గు టెట్లు పొసగు నోయి।
నామమందు సుంత ప్రేమ లేని ఎదకు। స్వామి నందుకొనుట సాధ్యమగునె 402
హర్షమనెడి ధనము అదనులో దొరికిన । దాని సాటి సొత్తు ధరను లేదు ।
బాహ్య రత్నమేది బంధమ్ము తెంచదు । మోదమొకటి మదిని సేదదీర్చు 403
అదును పదును గాక అరక సేద్యము గాక । నారుబోయ ఫలము చేరబోదు ।
ఋతువు దెచ్చు ఫలము చతురాననుండైన । తెచ్చి యివ్వలేడు తేరగాదు। 404

ఎందు చిక్కుకున్న నెదురేది వచ్చినా । ఎట్టి బాధపెట్టు నెవ్వడైన । భయము విడిచి పెట్టి భగవంతునికి చెప్పు । అజుడు పెట్టినట్లే యగును తుదకు 405
నాది నేనటంచు నర్మిలి(కోరుకొనుట) పడనేల। నీది యేది భువిని నిలుపగలవు । నీదికాని చోట నీకెందుకీ బాధ । సత్యమిద్ది తెలిసి చనుట మేలు. 406
దాస్య దైన్య దీన దారిద్ర్యములవెల్ల । అధిగమించినాడ అభవు దయను । తేట నీటి లోన తేలెడి చేపనై । సంతరింతు వాని సంగమందు 407
ధైర్యహీనుడైన, దైన్యవంతుడైన । కటిక పేదయైన, కసరుడైన(కోపిష్టి), । సత్య హీనుడైన, సమ్మోహనుండైన । ప్రభువు భువికి నిచ్చు వరము గాదె. 408
అణగి యుండుటెల్ల అల్పమ్ము గాబోదు. లొంగదీయ బోకు ! లొంగి పొమ్ము! శివుని త్రాసునందు చితుకువాడే గొప్ప. తత్వమెఱిగి మనికి(మనుగడ) దాటవలెను. 409
నీరు పల్లమందు నిలిచి యుండుట కద్దు । వంగి యున్ననాడే గంగ దొఱకు । నిక్కి యున్న వాడు నీటినందగ లేడు । తగ్గియుండు టెపుడు తరుగుగాదు 410

లొంగియున్న వారు లోనైన వారునూ । దైవ మార్గమెరిగి దాపుజేరె ! । అగ్రజాతియంచు అహము దేలెడి వాడు । గర్వనావ నెక్కి గంగ మునిగె 411
చిన్నయైన వాని చేరదీయుదురంత । చిన్నవాని కన్ని చేరగలవు । విదియ చంద్రుడన్న వీనుల విందౌను । చిన్నరిక మెనయగ మిన్నగాదె 412
చెడ్డవాని కొఱకు దొడ్డగా వెతకంగ । చిక్కలేదు నాకు ఒక్కడైన । ఎంత చోద్యమంచు అంతర్ముఖుడనైతి । నేనె చెడగు ననెడి నిజము తెలిసె 413
నాది యన్నదేది నా యందు కనరాదు । నీది గాక అన్య మేది లేదు । నీది నీకు జేర్చు నేర్పు దొరికెనేని । అంతకన్న భాగ్యమంద గలమె 414
ఎంత ప్రతిభయున్న అంత ప్రాభవముండు । ప్రాభవమ్ము పెరుగ ప్రభువు పోవు । మత్తగజము తలను మట్టి జల్లుకొనును - చీమ పంచదార స్వీకరించు 415
ఎంత జ్ఞానముండి యేమి లాభము చేరు । దయ కలిగిన వాడె ధర్మపరుడు । కరుణ లేనివాడు కర్మబంధనమున । నరక ప్రాప్తి పొందు, నమ్ముమయ్య 416
ఎవరిమీద జాలి ఎవరి మీద కఱకు । ఎవరి కెవరు కర్త లెవరు భువిని । కపిశ(కపిశ)మైన గాని కఱటి(ఏనుగు)యైనను గాని । అజుని సృష్టిలోని అంశగాదె 417
సత్యమునకు నైటి సాధనక్కరలేదు । కల్ల మించినట్టి కలుషమేది । సత్యమున్న చోట స్వామియూ నివసించు । ఋతము కానిదేది హితవు కాదు 418
సత్యరూపుడైన జగదీశ్వరుని తోడ । సత్యబంధమైన సాగ గలదు । బద్ధులాడుటన్న భగవానునికి రోత । సతము సత్యప్రియుడు సర్వసాక్షి 419
సత్యమునకు నెచట శాపమంటదు సుమ్ము । సత్వస్థితికి నందు చావులేదు । సత్యమున్నయడల సత్యమ్మున్ చేరు - తెలిసి సత్యమందె మెలగు మోయి 420
స్పర్శ నెడము సేయ సౌహార్ద్ర మెట్లుండు । సత్య స్పర్శ లేక సాధనేది । ప్రేమ కంచుకమును పేర్మితో ధరియించు । సత్యవ్రతుని సతము సన్నుతింతు 421

దేహమొక 'రబాబు' తీగల నాడులు - మీటు విరహమెపుడు చాటుగాను ।
అందు నుద్భవించు నాహవ నాదమ్ము । శివుని చేరు పరుల చేరబోదు 422
ఎవని యెదను సత్యమెప్పుడూ పండునో. అతడె అన్నియెడల అధికుడగును
శమము(శాంతి) దొరక దెచట శతకోటి పోసినా । సత్యమున్నచోట శాంతముండు 423
బోధ గురుని జేరి బోధించ రమ్మని । యడుగ లజ్జ గలుగు నాత్మలోన ।
అంధునెదుట నాట్య మాడంగ హితవేమి । ఆత్మనెఱిగిన పరమాత్మ తెలియు 424

జ్ఞానియైనవాడు జ్ఞాని తాననుకోడు । పాఠమిచ్చినంత ప్రాజ్ఞుడు । అరయ గలిగె నేని అద్వైత సత్యమ్ము । తనను తాను తెలిసి తనియ గలడు 425
నీటి బొమ్మ నింద నిండియున్నది గాలి । ఉర్వి మీద బుట్టి ఉనికి బొందు । ప్రతిమలోని గాలి పలుబాసలను బల్కు । అందు దివ్వెవోలె అజుడు వెలుగు 426
విషయవాంఛలన్ని విడిచి పెట్టిననాడు । నామ చింతనమ్ము నడుచుచుండు । నియమ నిష్ఠ లందు నిర్గుణ నామమ్ము । తలచువాని కెట్టి తరుగులేదు 427
అన్నిచోట్ల నుందు రాచారవంతులు । సత్య మరయువారె చాలరైరి । కోటి ఆచరణలు కొఱగావు ఋజువుకు । సత్యసంధుడైన జయము నందు 428
తెలిసి పలుకుమాట వెలకట్టలేనిది । తూచి పలుకునపుడె దొడ్డతనము । ఎదను బుట్ట వలయు నేమాటలైననూ । పెదవి నుంచి బలుక ప్రియుడు వినడు 429
కులము గోత్రమంచు కుమ్ములాటలు యేల । జ్ఞానమ్మెటి కులమొ చాటగలవె ? ఎవడు పదుగురకును ఉత్తమై నిలుచునో । అతడె గొప్పవాడు అవని కంత 430

అహము గలుగుచోట ఆయోగ(జ్ఞానం) ముండదు । విత్తి గలిగెనేని విచల(గర్వం) ముదుకు ।
తెరవు(వివేకం) తెలియలేక దేవులాటలు యేల । నెగవు(గర్వం) తెగిన నీకు నీవు గురువు 431
కూలి లేని చోట కొలువు చేయగరాదు । బుద్దిలేని తనువు భూమి మోత । ఎఱుకలేని యోగ మెంతైన ఫలమేమి । బూది పూసుకున్న బోధియగునె 432
మూర్ఖునెంత జేసి మురిపించి చెప్పినా । సుంత మార్పు నైన చూడబోము । వాడి శరము కఱకు బండపై విడిచిన । పదునుబోవు గాని ఫలితమేమి? 433
రసము లారు గలుగ రసభోగ మబ్బెను । అనుభవించు జిహ్వ ఆనికయ్యె । దొంగ చెంత జేటి చొంగకార్చెడి కుక్క । ఏమి కాచగలుగు? నెవరి బట్టు? 434
పగలు భుక్తి మాని పరమాత్మ స్మరణమ్ము । మాంస భక్షణమ్ము మాపటేళ । ఇట్లు సేయ విభుడు ఎటుల సంతోషించు । ఒకటి యర్పణమ్ము యొకటి హత్య 435
ఎండు రొట్టెనిచ్చి యెలమి(ఆదరణ)చూపిన చాలు. క్షుత్తులారి ప్రభుని కొలుచువాడ. కాలగతిని చివుకు కట్టెకు రుచులేల?. ఆకులలములైన అమృత మగును. 436
అలఘు సృష్టిలోన తొలిరూపు ఒక్కటే । సర్వశక్తి యుతుడు సర్వసాక్షి । సృజన చేయనెంచి సృష్టించె నాదంబు । అది యనాహతమను అద్భుతమ్ము 437
ఏడు లోకములును ఏడు స్వరములును । జీవజనితమయ్యె చిత్తవృత్తి । అచట శబ్దశక్తి ఐదు రూపులు బొందె । పంచబ్రహ్మలయ్యె సంచితముగ 438
అమిత యోగశక్తి అక్షరుండై పుట్టె । సర్వసృష్టి కతడు సారభూతి । నాలుగంశ లకట నాల్గు వేదములయ్యె । కాలచక్రగతులు ఖాయమయ్యె 439
ఊర్పు నందు 'సోహ' ముద్భవించెనపుడు । అమృత ధామ మనగ నలరుచుండు । ఎనిమిదంశ లందు ఏకమై రుచిరమై । అండ ముద్భవించె హంస దీప్తి 440

విరహభక్తి యెదను వికలమ్ము సేయగా । వైద్యుడేమొ నాడిబట్టి చూచు ।
ఎదను మండు బాధ సదయు డెరుగుగాని । పరులకేమి తెలియు భ్రమలు తప్ప 441
సృజన, ఉనికి, లయము సృష్టికి మూలమ్ము. ముగురు మూర్తులకవి ముఖ్యవృత్తి.
పిదప నుద్భవించె ప్రియమైన లోకాలు. ఆది పురుషునిచ్చ అమృతకరము 442
అన్ని భావములకు ఆది సప్తశ్రుతులు । శ్రుతుల గతుల జరిగె సృష్టియంత ।
లయము శ్రుతులలోని లాలిత్య జీవమ్ము । కాల ధర్మమదియె కలిమి అదియె 443
చావు పుట్టుకలను చదరంగ జీవన । మ్మంటి సుఖము దుఃఖ మలది యుండు । మాటికొచ్చి విభుడు యేటిని దాటించి । చెప్పలేని భ్రమల నప్పగించు 444
ఇట్టి జ్ఞాన మరసి ఇంగితమ్ము తెలిసి । పరిఢవిల్లువాడు ప్రాజ్ఞుడగును । అతడు శ్రుతులు దాటి ఆనంద నాదమున్ । హంసలందు కలసి యాడుచుండు 445
మనసు కోరినట్లు మనుట సాధ్యమగునె । పొత్తు రాదు మనసు పోకడలకు । మనసు నదుపు చేసి మనువాడే సాధువు ।అట్టి సాధువెవరు అవని మీద? 446
కోర్కె బట్టి పోవు కోరి ప్రపంచమ్ము । శాస్త్ర మనుసరించు సాధువెపుడు । గురువు వెంట నడక గురుతుగా సాగును । గురువులేని దారి గుడ్డిదారి 447
చిత్త మైదు కరణ వృత్తులం దమియించె । వదలి పోవజాల వహ్నికీల । శబ్ద రూప రసన స్పర్శ గంధమ్ముల । నావహించి సత్య మలరుచుండు 448

అరయ జీవుడొకడు ఆర్గురు శత్రువుల్ । అందరొక్కసారి ఆవహించు । వాటి చవుల కొఱకు వారాంగనను చేసి । ఆటలాడ జేయు నాత్మనెపుడు 449

అబ్ధి తరగలెన్నొ ఆత్మ పరుగులన్ని. మనసు నందు బుట్టి మరులు గొలుపు । మనసు కాకి యైన మలినమ్ము దినుచుండు. హంసయైన ముత్య మరసి తినును 450

ఆది దైవ మార్గ మంతరాత్మ నిలిపి । హద్దులోన కాపు 'బుద్ధి'నుంచి । తనువు మనసు మరచి తగు మార్గమున బోవ । రామ రాజ్య పథ సుగామి వగుదు 451

మనసు స్థూలమగును మనసు సూక్ష్మమగును. మనసు నీరమగును మనసు మండు. మనసు వన్నెలాడి, మారును వరుసగా. మార్పు నెఱుగ నట్టి మాన్యుడెవరు! 452

దర్పణమ్ము గలదు దరహాస హృదయాన. దానియందు ముఖము కానరాదు. మనసులోని ద్వంద్వ మాలిన్య ముడిగిన. మొగము కానుపించు ముకురమందు 453

మనసు లోని కోర్కె మర్ధించ గలిగిన । అంతకంటె మిగుల అందమేది ? । పద్మకాంతుల తలపై పైన వెల్గెద । కోర్కె లేని ఎదకు కొదువ లేదు 454

మనసు భీకరమగు మత్తేభ తుల్యమ్ము । దాని వెనుక కాంక్ష దాగియుండు । బుద్ధి అంకుశమున భూరి మదగజము. నణచి పొందునెమ్మి యమృత ఫలము. 455

కట్టువడదు మనసు కలిగిన జ్ఞానాన । మనసు లేక జ్ఞాన మహిమ లేదు । నీరు కడవలోన నిలిచి కట్టువడును । నీరులేక కడవ నెలవు లేదు 456

మనసు మనిషి కెపుడు మాయావిచే కోతి । తాడు చేతబట్టి నడప వలయు । కదురుబట్టి నూలుకండె జుట్టినయట్లు । మనసు చుట్టిపెట్టి మసలుకొమ్ము 457

మనసు మోసకారి మరలతో ముంచెత్తు । లక్ష గడపలున్న రచ్చయద్ది । మునులు దివిజులైన మోసపోయెదరన్న । మనసు అదుపునుంచి మర్మమెఱుగు 458

తిరిగి తిరిగి దేశదేశమ్ములన్నియు । తిరుగలి వలెనచట తిరుగుచుంటి । మనసు కదలనపుడు మనిషి తిరుగనేమి? । మదిని తరచి వెదుక మాయ తొలగె 459

కన్ను మూసినంత కలలోన రాముండు । కన్ను తెఱవ ఎదుట కపిరథుండు । నేత్రమే ఋజువగు, నిజము కబీరుకు । మరువలేను విభుని మరణమైన 460

చేతకాడ వీవు చేయి పట్టుము రామ । ఎదురు చూచుచుంటి నెంతగానో ।

గతిని దలచి నన్ను గమ్యమ్ము చేర్చుము । పట్టి విడువరాదు పరమ పురుష 461

చల్లనైన నీడ సరసమైనవి పండ్లు । అందమైన పూలు ఆకు సిరులు ।

పడని గాలిపీల్చి ప్రాణవాయువు నిచ్చు । చెట్టు పెంచుమోయి చెఱుపురాదు 462

సాధుజనుల పొందు, సహజ తరువనమ్ము । చల్లనైన సరసు, నల్లమబ్బు ।

పరుల మేలు కొఱకె ప్రాదుర్భవించును । పరహితమ్ము సాక్షి ప్రకృతి గాదె 463

పరుల బ్రతుకు తెలిసి పరులబాధ తెలిసి । పరులతో మెలగును పరమహంస । పరుల నెఱగలేని ప్రల్లదుండెన్నడూ । యోగికాడు మాయభోగి గాని 464

వంగిన ప్రతివాడు వాసి చాలక కాదు । తగ్గియుండుటన్న తరుగుకాదు । దొంగ, చిఱుత, విల్లు వంగినపుడె వాడి । వంగియున్న వాడె నింగికెగయు 465

స్వాతిచినుకు ద్రావి జాతిముత్యము నిచ్చు । కాకిచిప్ప చెన్ను కడలి కొప్పు । ఉనికి జలధిగాని ఉప్పునీరు గొనదు । విలువ జూతురెల్ల విబుధులెపుడు 466

నేలబడిన చుక్క నీరైన తాకదు । చండవేడినైన చాతకమ్ము । మేను కష్టపెట్టు మేఘునడగబోదు । జాతి పౌరుషమ్ము నీతిగాదె 467

వెదకి వెదకి వెదకి వేసారి పోయితి । బిందు వెక్కడుండె ! సింధువయ్యె ! । వేరు చేయగలుగు వారెవ్వ రిలలోన । ఆత్మ కలసిన పరమాత్మ వెలుగు. 468

బీజమందొదిగి మహీజముండెడు రీతి । ఆత్మయందే సర్వ మణగి యుండు । ఆత్మ కలుషమైన అన్నియూ కలుషమే । చిత్త మర్మమెఱుగ చింతలేదు 469
అంత్య గమనమన్న అంతటి భయమెల । పుట్టు వున్నచోట పుడకలుండు । మనకుమాత్ర మౌనె మరణమ్ము భువిలోన । కాలధర్మమిదియె కాలమిదియె 470
తనువు గలిగియున్న తగుశిక్ష వెన్నంటు । దానినెవ్వరేని దాటలేరు । తెలిసి యనుభవించు ధీశాలి ముదమున । అంగలార్చి మూర్ఖుడనుభవించు 471
సత్య సృష్టి నరయ సర్వజనులొకటె । వేఱుచేసి చూడ వెరవుగాదు । వస్తువున్న చాలు వాసమరయనేమి? । దైవ సృష్టిలోన ధర్మమొకటె 472
చాడికోరు, దొంగ, జారుండు, ఋణదాయి(వడ్డీవ్యాపారి). అక్షకుండు, కపటి యనెడివారు. వరుస బంధువైన వర్జింప దగువారు. విడిచినపుడె బ్రతుకు వేడుకగును. 473
వస్తు మోహమొకటి, వన్నె మోహమొకటి, । వలపు మోహమొకటి వదలలేము । మోహభ్రాంతిలోన మునిగి తేలెడి వాని । స్వీకరించలేడు శివుడు కూడ 474
ఆడి పాడు గాక ఆనందపడు గాక । పొగడుగాక ధనము బూన్చు గాక । గురుని బోధ లేక గురిరాదు ! భువి పంట । విత్తకుండ మొలక లెత్త గలవె! 475
అర్కతేజుడైన అమృతకిరణుడైన । వెలుగు లేనినాడు విలువలేదు । ఎవని అంశువైన ఎట్టి వెలుగులైన । వాని యందె పుట్టి లీనమగును 476
కొలనులోన చేరి కలహంస తోడుగా । ఒక్కచోట గడుపు కొక్కెరాయి । పాలునీరు కలిపి ప్రారబ్ధ మందింప । చెలగి కొంగ హంస బలిమి తెలిసె 477
కట్టె విరిచి తిరిగి కలపంగ నతుకునా? । నీరు కోసి చూడ వేరు యగునె । కోరి కాచు వాడు 'గోరఖు' డొక్కడే । ప్రాపులేక ఇహము పరములేదు 478
నీరనిధిని(సముద్రం)యుండె నీటి పడవొకటి. అందు పడగ విప్పి అగము(పాము)నిలిచె. విడువ పడవబోవు విడకున్న కాటేయు. ఏది దారి రామ!ఏమి చేతు? 479
చిలుక చేరియుండె చిరజీవ వృక్షాన । చంచువు సరిజేసె మించు గీర(అహము) । కాలమెలమి రాగక్ష్మాజమ్ము విడనాడె । చెట్టుకేది విలువ చెప్పవయ్య 480

ఊరు తెలియలేదు పేరు తెలియలేదు । నడచి నడచి యుగము గడచిపోయె ।
నాల్గు క్రోసులున్న నడవ గడవ లేక । నాధు జేరుటెట్లు సాధువైన 481
బహిరపరచి చెప్ప భరియింప జాలరు । కప్పిపెట్టి యుంచ కానలేరు ।
సత్యదర్శనమ్ము సాము గరిడి సాటి । తెలిపి వైరమేల తెచ్చుకొనుట! 482
చుక్కవెలుగు వరకు సూర్యుండు రాలేడు. 'తరణి'(సూర్యుడు)యున్న చోట తమము లేదు.
చేతనమ్ము గలుగ చేత చెదరిపోవు. మర్మమెరిగి నపుడె కర్మ తెగును 483
నీదు కాళ్ళమీద నీవు నిల్వగ మేలు । పరుల ప్రాపుగోరి పరుగులొద్దు । వాకిటి దరిపారు వాహినిం గనలేక । దప్పిదప్పి యనెడి తప్తమేల? 484
మొదలు నరికి వేయ మోసులెత్తును వల్లి । చిగురుటాకు వేసి చేతమగును । నీరు బోసి పెంచ నిలువున వడబారు । అకట ! దైవ లీలలర్థమగునె? 485
హంస కులములోన నానందమునబుట్టి । హంస స్పర్శ పరమహంసనైతి । ఎద్దు నాపగలుగు బద్దనే ధరియించి । నీదు మ్రోల రామ నిలిచియుంటి 486
గుణము నెఱుగువాడు గుణమునే గ్రహియించు. ఎరుగనట్టి వాడు యేవగించు. జాజిఫలము రుచులు జాతోక్ష(కోడెదూడ)మెఱుగదు. గంధమెరుగ బోదు గడ్డి తినును. 487

మంచి క్షేత్ర మరసి మంచి విత్తులునాటి । సేద్యమెంతొ బాగ జేసినాడ । మొలక మొలవలేదు మోసమెవ్వరు చేసె । గుర్తు తెలియు మోయి కర్త ఎవరొ? 488
చేత జంత్రముండి చైతన్య శ్రుతులీన । మనసు దివ్యలోక మనికి యయ్యె ! । తెలియదోయి తీగ తెగిపోవునని సుంత । ఎవరి దోషమంచు నెరుగగలవు 489
చెప్పిచెప్పి పరుల చేతలన్ సరిచేసి । నీదు నోట దుమ్ము నింపుకొంటి । పరుల కుప్పగాయ ఫలితమే మగునోయి । కొల్లబోయె నీదు యిల్లు చూడు! 490
గురిని చూపునెవరు? గురి చూచు నెవ్వరు?। లక్ష్యసిద్ధి ఎవరు? లక్ష్యమెవరు?। అమ్ములన్ని పోయె అసలు చిక్కకపోయె। అందులోని మర్మ మరయగలవా? 491
ఎంద రేగినారు ఎందరొచ్చిరిటకు । భావ 'రూప'సామ్య బంధువెవరు?। తనది నాకు జెప్పి తను నాది వినునట్టి। తపసి దొరక లేదు ధరణియందు 492
దేశదేశమందు తిరిగి చూచితి నేను। ఊరు వాడలంట పోరి నాను। విభుని తెలియునట్టి వివరమ్ము గలవాడు। కానుపించలేదు కలికమునకు(కొంచెము). 493
అందమున్నదనుచు నానంద పడనేమి!। ప్రజ్ఞ గలిగినంత ఫలితమేమి?। మనసు మంచిదైన మవ్వము(మృదువు)న్ జ్ఞానమున్। పరిమళించు, పూన్కి ప్రతిఫలించు 494
గగన మంటుచెట్టు గంపెడన్నియు పండ్లు। ఫలముల చవి చెప్పనలవి కాదు । చేతి కందనపుడు చేయగల్గినదేమి?। పండి రాలిపోవ ఫలితమేమి? 495
స్పర్శ వలననేది బంగారమైనదో। దాని నినుము సేయ తరము గాదు। గంధసిరులు కింశుకా విటపిని(మోదుగుచెట్టు)చేర। దాన్ని మోదుగనుట తగవుగాదు 496
ఎముక సొమ్ముగాదు ఎఱచి తినగరాదు। తోలు తోలిగాని డోలుగాదు । మానవుండ నీదు మనసొక్కటే గొప్ప। ఎడద కలుష పరచి యేద్వనేల ! 497
సంశయమ్ము ద్రుంచి సహనశోభను పెంచి। పరవశమ్ము నింపి పాడుకొనుము। రాగ సంకటములు భోగపీడన తెగి। రామసన్నిధాన ధామమబ్బు. 498
ఎవని గంజిద్రావి ఈ బ్రతుకీడేరు। అతని యునికి నైన నరయబోరు। మార్గము గనలేక మహిని బ్రతకలేక। వేషధారులైరి విధికి జడిసి 499
యుతులు వెదకినారు సతులు వెదకినారు। కానలేరు తడవు(వెదకుట) మానబోరు। జాడ వెదకుటందు జడదారులైననూ । ఓడిపోయి పట్టువీడిపోరు. 500

హంస కొంగ కలిసి ఆకాశ మార్గాన। 'మానసరసి' చేరు మరులు తోడ।
ఒకి ముత్యమంటు నొకటి మత్స్యము నంటు। ఏది కోఱువాని కదియె చేరు 501
ప్రియుడు పిలుచుచుండె ప్రేమగా రమ్మని. నాకు చేర గలుగు తేకువేది.
దోసమనికి(కలుష శరీరం)తోడ దుర్వాసు(శివుడు)చేరంగ. బుద్ధి పొసగ బోదు పుణ్యచరిత. 502
ప్రేమ గలుగు వాని స్వామి చేపట్టును। కపటి కాపదలును కట్టియుండు।
సత్యశబ్దమందు సారమ్ము గ్రహియించు। పలువ మాట వలన ఫలితమేమి. 503

మనసు స్వామి దరిని మాధుర్యమై పండ। అంతరమ్ము రాదు సుంతయేది। కరగిపోవ మంచు కడవలో నీరౌను। హరియు హరిజనుండు అన్యమవరు 504
గళమువిప్పి నేను గాంధర్వ స్పృహతోడ। పారవశ్యమంది పాడినాను। ఇట్టి బలము నాకు నిచ్చువాడెవ్వడు। శౌరి అండనున్న శక్తికేమి? 505
అన్ని వృత్తుల లోను అతిమేలు తిరిపమ్ము। దానినడ్డువాడు ధరణిలేడు। రకరకమ్ములయిన రసనమ్ము లభియించు। పోరుగులేని పెద్ద భోగమదియె 506

కవిని గూర్చి..

పేరు : డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు

జననం : 04-09-1955

జన్మస్థలం : మద్దిపాడు, ప్రకాశం జిల్లా.

తల్లిదండ్రులు : శ్రీమతి సుబ్బరత్నమ్మ, 'లయబ్రహ్మ' శ్రీ భూసురపల్లి ఆదిశేషయ్య

విద్య : ఎమ్.ఎ. (తెలుగు) - ఆంధ్ర విశ్వవిద్యాలయం,
పిహెచ్.డి - పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

గురువులు : సాహిత్యరంగం - డాక్టర్ నాగభైరవ కోటేశ్వరరావు
సంగీతరంగం – పద్మశ్రీ హరిద్వార మంగళం, డాక్టర్ ఎ.కె. పళనివేల్

విశేషాంశం : డోలు, ఘటం, కంజీర వాద్యాల్లో ఉన్నతశ్రేణి ప్రావీణ్యత కలిగి ఉండడం.

రచనలు :

1. తెలుగుసాహిత్య రూపకాలు (పిహెచ్.డి. కోసం చేసిన పరిశోధన)
2. ఆంధ్రప్రదేశ్ నాదస్వర డోలు కళాకారుల చరిత్ర
3. దేవులపల్లి కష్ణశాస్త్రి - 1986 (కేంద్రసాహిత్య అకాడమీ ప్రచురణ-భారతీయ అధికార భాషల్లోకి, ఆంగ్లంలోకి అనువాదం)
4. నేతాజీ... (ఒరిస్సాలో ఉపవాచకం)
5. ఒక అనుభవం నుంచి (కవితాసంపుటి)
6. స్నేహగీతాలు (కబీర్ దోహాలకు పద్యానువాదం)
7. నాన్నకోసం... (కవితాసంపుటి)
8. నేత్రధ్వని (కవితాసంపుటి)
9. ప్రవాహశిల్పం (కవితాసంపుటి)
10. ప్రముఖ వాగ్గేయకారులు - అమరావతి ప్రచురణలు
11. ఆంధ్రప్రదేశ్ మంగళవాద్య కళావైభవం - నాదస్వరం (ప్రభుత్వ సాంస్కృతికశాఖ-తెలుగు అకాడమీ సంయుక్త ప్రచురణ)
12. ఆంధ్రప్రదేశ్ మంగళవాద్య కళావైభవం - డోలు (ప్రభుత్వ సాంస్కృతికశాఖ సంయుక్త ప్రచురణ) తెలుగు అకాడమీ
13. సమీకరణం (వచన కవితా సంపుటి)
14. దగ్గగోళం (దీర్ఘకవిత)

డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు

ముద్రణలో...

15. ఆంధ్రుల జానపదకళలు (పరిశోధక కళావ్యాసాలు)

అముద్రిత రచనలు

16. చిత్రశాల (చారిత్రక నవల)

17. త్యాగరాజు (చారిత్రక నవల)

18. గురు లేక ఎటువంటి... (ఆకాశవాణి సంగీత రూపకం) విజయవాడ ఆకాశవాణిలో ప్రసారం

19. నాదనామక్రియ (ఆకాశవాణి సంగీత రూపకం) -విజయవాడ ఆకాశవాణిలో ప్రసారం.

మరికొన్ని సాహిత్య, సంగీత, నాట్యకళా వ్యాసాలు, కవితలు - సాహిత్య రూపకాలు.

పరిశోధనలో...

1. ఆంధ్రుల సంగీత చరిత్ర
2. తెలుగు సాహిత్యంలో లయాత్మకత

పొందిన అవార్డులు

1. శ్రీ స్వామి చిన్మయానంద నుంచి హరిద్వారం లో 'సరస్వతీపుత్ర' బిరుదు పొందడం-(అనంతరం మట్ట లో నాదస్వర డోలు కళాకారుల చరిత్ర ఆవిష్కరణ వేదికపై చిన్మయామిషన్ ప్రధానాచార్యులు స్వామిని శ్రీ శారదాప్రియానంద ఆ బిరుదుని ఫలకం చేసి తెచ్చారు. ఆ సభలో డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యుల వారుండడం యాదృచ్ఛిక ఘటన.) 1986.
2. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ అధ్యాపక పురస్కారం 1994.
3. 'పర్కషన్ ఇండియా' కార్యక్రమంలో ఉస్తాద్ జాకీర్ హుస్సేన్‌తో ఢిల్లీ 'ఇండియన్ హాబిటేట్ సెంటర్'లో ప్రధాని గౌ॥ పి.వి. నరసింహారావుగారితో విశిష్ట ప్రభుత్వ పురస్కారం 1995
4. ప్రపంచ తెలుగు సమాఖ్య ద్వితీయ మహాసభలో (హైదరాబాద్) ప్రత్యేక సాహిత్య పురస్కారం (డా. బెజవాడ గోపాలరెడ్డి, గవర్నర్ కృష్ణకాంత్) - 1996.
5. బొంబాయి అఖిలభారత తెలుగు మహాసభల్లో ప్రత్యేక సాహిత్య పురస్కారం (డా. వావిలాల గోపాలకృష్ణయ్య గారిచే) - 1997.
6. ఆచార్య ఆత్రేయ స్మారక కళాపురస్కారం (ఒంగోలు) 1997.
7. డాక్టర్ నాగభైరవ సాహిత్యపీఠం ప్రతిభాపురస్కారం - 1998.
8. నటరాజ లలితకళా సమాఖ్య మార్కాపురం లలితకళాపురస్కారం-1999.
9. చెన్నై ఆంధ్రా క్లబ్ 'ఆస్థానం' ఆవరణంలో 'వేదిక' సాహితీ సాంస్కృతిక సమాఖ్యవారి ప్రత్యేక సత్కారం. యస్.పి.బాలసుబ్రహ్మణ్యం గారి అధ్యక్షతలో వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ నిర్వహణలో దర్శకుడు కె. విశ్వనాథ్‌గారు, అల్లు

రామలింగయ్యగారు, గొల్లపూడి మారుతీరావుగారు అతిథులుగా పాల్గొని సన్మానించారు. శ్రీ పప్పు వేణుగోపాలరావు, శ్రీ భువనచంద్ర ప్రశంసలు మరువలేని సంఘటన - 1999.

10. తెలుగు సాహిత్యసమితి (చెంబూర్) బొంబాయివారిచే గౌరవ సత్కారం - 1999. అదే సభలో నాచే గురజాడ స్మారకోపన్యాసం.

11. ఆ మరునాడే బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌లో నాచే రాజా రామన్న స్మారక ఉపన్యాసం, చైర్మన్: ఆర్. చిదంబరం చేతులమీదుగా - 1999.

12. ఢిల్లీ ఆంధ్రా అసోసియేషన్ తెలుగు ప్రతిభా పురస్కారం (గౌ॥ ముప్పవరపు వెంకయ్యనాయుడుగారిచే) - 2000. డా॥ వి. కృష్ణమూర్తి, డా॥ కె.జి.రావు కార్యక్రమ నిర్వహణ.

13. వెలిది వెంకటేశ్వర్లు యువచైతన్య విజ్ఞానవేదిక జాతీయ కవిత్వ పోటీలో ప్రథమ బహుమతి - 2001.

14. హిందీ ప్రేమీ మండలి మహావిద్యాలయం, తెనాలిలో పూర్వ విద్యార్థులచే ఆత్మీయ సత్కారం - 2002.

15. జాన్ రాఘవయ్య జాతీయ విద్యా పురస్కారం 2001.

16. నాదబ్రహ్మ కళానిలయంవారిచే 'వినయభూషణ' బిరుదు ప్రదానం, గౌరవసత్కారం 2008.

17. సంగీత విద్వాన్ శ్రీ పోరూరి నరసింహారావు స్మారక పురస్కారం (హైదరాబాద్) - 2008.

18. తిరుపతి ప్రపంచ తెలుగు మహాసభలలో ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ కిరణ్‌కుమారెడ్డిగారిచే విశిష్ట సత్కారం - 2012.

19. చిలకలూరిపేట కళానిలయం వారిచే "సంగీత విజ్ఞాన్" పురస్కారం 2013.

20. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కార - 2013.

21. కొండూరి చారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్ వారిచే కవయిత్రి మొల్ల సాహిత్య పురస్కారం 2014.

22. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ నారా చంద్రబాబునాయుడుగారిచే గోదావరి పుష్కర ప్రత్యేక కవి సన్మానం 2017.

23. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఫౌండేషన్ డే) ప్రతిభా పురస్కారం - 2015.

24. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ నారా చంద్రబాబునాయుడుగారిచే సంగీత సాహిత్య రంగాలలో ఉగాది ప్రతిభా పురస్కారం - 2016.

25. గుంటూరులోని ఆరు సంస్థలు కలిసి ప్రతిభామూర్తులు పేరుతో పురస్కారం - 2016.

26. సిలికానాంధ్రవారు 5000 మంది కళాకారులతో జరిపిన కన్వెన్షన్ కార్యక్రమంలో కేంద్రమంత్రి శ్రీమతి దగ్గుబాటి పురంధరేశ్వరిగారిచే ప్రత్యేక సన్మానం 2017.

27. గాయత్రీ మహిళా సంగీత సన్మండలివారి ఆత్మీయ పురస్కారం 2017.

28. ఠాగూర్ ఎడ్యుకేషన్ సొసైటీ (గుంటూరు జిల్లా నాయీబ్రాహ్మణ సంఘం) వారి ఆత్మీయ సత్కారం 2017.

29. "స్పిక్ మేకే" అంతర్జాతీయ కళాసంస్థ వారిచే పాల్ఘాట్ మణిఅయ్యర్ స్మారక పురస్కారం - 2017.

30. ఒంగోలు కళామిత్ర జాతీయ పురస్కారం 2017.

31. జి.వి.ఆర్ కల్చరల్ ట్రస్ట్ హైదరాబాదు వారి సాహిత్య ప్రతిభా పురస్కారం - 2018.

32. కొంపల్లి బాలకృష్ణ జాతీయ సాహిత్య పురస్కారం - 2018.

33. రాజమహేంద్రవరం జి. తాతారావు విశిష్ట సాహిత్య పురస్కారం 2018.

34. శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి, ఒంగోలు జాతీయ పురస్కారం - 2018.

35. సృజన తొలి ఆత్మీయ పురస్కారం (అద్దంకి) – 2018.

36. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అత్యున్నత పౌర పురస్కారం 'హంస కళారత్న' పురస్కారం - 2018.
37. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (NIT, వరంగల్) మాతృభాషా దినోత్సవ పురస్కారం - 2019.
38. కవిసంధ్య 'శిఖామణి' సాహిత్య పురస్కారం, యానాం – 2019.
39. సర్రాజు వేణుగోపాలరావు స్మారక ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, గంటూరు - 2021.
40. అభినయ (ఒంగోలు) వారి వార్షికోత్సవ పురస్కారం 2022.
41. యువకళావాహిని (హైదరాబాద్) వారి 'అమరావతి తెలుగు వెలుగులు' - 2022.
42. అఖిలభారత వాద్యకళాకారుల సంఘ వార్షికోత్సవ (హైదరాబాద్) ప్రత్యేక సన్మానం - 2022.
43. వికాసాంధ్ర సాహితీ సాంస్కృతిక వేదిక (వికాసం) బరంపురం, ఒడిస్సావారి స్వర్ణోత్సవ ప్రత్యేక పురస్కారం- 2022.
44. శ్రీ రావి రంగారావు జనరంజక కవి ప్రతిభా పురస్కారం - 2023.
45. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) నాలుగవ వార్షికోత్సవ ప్రత్యేక సత్కారం, కర్నూలు - 2023.
46. నెల్లూరు జిల్లా రచయితల సంఘం, శోభకృత్ ఉగాది ప్రత్యేక పురస్కారం

కొన్ని విశేషాలు

1. శ్రీమతి యం.యస్. సుబ్బులక్ష్మి, డా. మంగళంపల్లి బాలమురళీకృష్ణ గార్ల నుంచి నేటి వర్ధమాన విద్వాంసుల వరకు కర్నాటక సంగీతంలోని దాదాపు అందరు కళాకారులతో సహకార వాద్యం 'ఘటం'తో కచ్చేరీల్లో పాల్గొనటం.
2. సిలికానాంధ్ర వారు ఐదువేలమంది కళాకారులతో నాదస్వర కన్వెన్షన్‌లో జరిపినారు. ఈ కార్యక్రమం పూర్తి నిర్వహణ. దీనికి 4 గిన్నిస్‌బుక్ రికార్డులు వచ్చాయి.
3. 1975 నుంచి ఆకాశవాణిలో డోలు, కంజీర, ఘటం వాదాలలోను, సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొనటం.
4. అద్దంకిలో స్థాపించిన 'సృజన' సాహిత్య సంస్థ ఇప్పటికీ ఆరోగ్యకరంగా సాహిత్యసేవ చేస్తున్నది.
5. విద్యార్థులను ప్రోత్సహించి కవిత్వం రాయించి, సంపాదకత్వంలో "చిరుదివ్వెలు", ''స్వాతిచినుకులు'' అనే రెండు కవితాసంపుటులు ముద్రించారు.
6. ప్రకాశం జిల్లా రచయితల సంఘంలో తొలినుంచి (1973) కార్యవర్గ సభ్యుడుగా, 1990 నుంచి నాలుగేళ్ళపాటు ప్రధాన కార్యదర్శిగా పనిచేయటం.


1

2
Your Influence Extends Beyond the CLASSROOM Well into the FUTURE
BEST TEACHER EVER

3

4

5


6

7

8


10


11

12

13

14
नागपुर
प्रथम पुरस्कार

15
INDIA
EDUCATION
AWARDS

16

17

18

19
KALANILAYAM DRAMAVISION

20
పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREE RAMULU
TELUGU UNIVERSITY

21

22
Godavari Pushkaram is a Festival
of River Godavari

23
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయము
ACHARYA NAGARJUNA UNIVERSITY

24

25

THE GREAT ARTISTS
Their lives, works and inspiration
26

27


28
RABINDRANATH TAGORE

29
spic macay

30
ఒంగోలు
ओंगोल
ONGOLE

31

32

33

34

35


36


38
WELCOME
YANAM
PONDICHERRY · U.T.

39
CELEBRATING
HAPPY
Teachers
DAY

40

41

42

43
BRAHMAPUR

45

46

2
ంగళవాద్య మహానాదం

3

SANT KABIR
संत कबीर
भारत
INDIA
1500
INDIA